MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 24 సంచిక: 10 రంగారెడ్డి జూన్ 2026 పేజీలు : 36 వెల : రూ. 10/-



తెలంగాణ గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా గారిని ఏపిమాస్ రజితోత్సవాలకు ముఖ్య అతిధిగా ఆహ్వానించిన ఏపిమాస్ సి ఇ ఓ, ఎం డి శ్రీ సి ఎస్ రెడ్డి, ఫైనాన్స్ డైరెక్టర్ శ్రీ జి. శ్రీనివాస రెడ్డి

## రజితోత్సవ ప్రస్థాన ప్రాంగణాన ఏపిమాస్ !



కైలాస పర్వత శిఖరాగ్ర కమనీయ నేపథ్యంలో

**శ్రీ సి ఎస్ రెడ్డి**






ప్రముఖ పర్యావరణవేత్త

**శ్రీ కె ఎస్ గోపాల్**

కన్నుమూత

**ఏపిమాస్ రజితోత్సవ సందర్భంగా ప్రముఖుల సందేశాల ప్రత్యేక సంచిక!**

NABARD నాబార్డ్ సౌజన్యంతో ....


మీకు తెలుసా ?

గత 46 ఏళ్ళల్లో (1970-2016 ) ..

- ఉష్ణోగ్రత 0.48 డిగ్రీలు పెరిగింది
  - దీనివల్ల పంట దిగుబడులు 3%-10% వరకు తగ్గాయి.
- వానాకాలంలో పడే వాన 26 మి.మీ.లు తగ్గింది
  - 0.1 మి.మీ. వాన తగ్గితే, దిగుబడులు 0.2% -0.3% వరకు తగ్గుతాయి
  - మొత్తంగా పంట దిగుబడులు 13%-18% వరకు తగ్గాయి.
- వ్యవసాయ ఆదాయం సగటున 15%-25% తగ్గింది

## వాతావరణం మారుతోంది...

ఏటేటా పెరుగుతున్న ఎండలు



వద్దనుకుంటే వానలు...



జీవం కోల్పోతున్న భూములు....



పెరుగుతున్న పంటకు పురుగులు, తెగుళ్ళు ...



## బతుకు భద్రత తగ్గుతోంది...




వాన కోసం ఎదురుచూపులు...



అనుకోని వరదలు ...



మొలకకు అందని నీళ్ళు



చేతికి అందని పంటలు

రానున్న 30 ఏళ్ళల్లో (2020-2050) ...

ఉష్ణోగ్రత 1%- 1.4% పెరుగుతుందని అంచనా ... ఒక్కసారి పరిస్థితి ఊహించండి!!

## మనకున్నది ఇప్పుడు ఒకే మార్గం...

## వాతావరణ మార్పులను తట్టుకునేలా సంసిద్ధం కావడం

NABARD

# మహిళా సాధికారత


సంపుటి 24 సంచిక 10



## ధన్యవాదాలు!

సంపాదకీయం

ఒక అరుదైన అనుభూతికి, ఒక చారిత్రాత్మక ఘట్టానికి కేవలం అడుగు దూరంలో వుండడం ఎంతో ఉద్వేగంగా వుంటుంది. ఇటీవలే నేను, నా జీవిత భాగస్వామి శ్రీమతి సబిత కొంత సాహసంతో, దృఢ సంకల్పంతో, శ్రమను తట్టుకోగలిగే మానసిక స్థైర్యంతో, జీవితంలో ఒక్కసారి చేయగలిగితే చాలు అనిపించే పవిత్ర మానస సరోవర మనోహర యాత్రను చేసివచ్చాము. మూడు రోజులపాటు సాగే ఆ పరిక్రమ గమనం నిజంగా ఒక సవాలు ! ముఖ్యంగా రెండవ రోజు. క్రమం తప్పకుండా నిత్యం వాకింగ్‌చేసే నేను సైతం ఆ రెండవ రోజున ఎంతో చెమటోడ్చాల్సి వచ్చింది. పరిక్రమ పూర్తిచేసుకుని, స్వర్ణ కాంతుల సుమనోహర శోభలతో కనువిందుచేసే కైలాస పర్వత శిఖర దర్శనం ఎప్పుడెప్పుడా అని ఎంతో ఉద్వేగం! అది ఒక అనిర్వచనీయ ఘట్టం! ఏపిమాస్ యిప్పుడు అలాంటి మహోద్వేగ, చిరస్మరణీయ, మధుర ఘట్టానికి అతి చేరువలో వుంది. 25 వసంతాల సేవా ప్రస్థానంతో రజితోత్సవం ముంగిట నిలిచింది. వచ్చే నెల ఒకటవ తేదీన రజితోత్సవానికి సన్నద్ధమవుతున్నది. ఒక్కసారి వెనుదిరిగి చూస్తే, ఎన్నో ఎన్నెన్నో విశేష అనుభూతులు, విలక్షణ అనుభవాలు! ఎందరో మహనీయులతో కలసి నడిచిన సందర్భాలు, ఎందరెందరికో సేవలందించే సదవకాశాలు. మహిళా సాధికారతకు, సంఘటిత స్వయంసహాయ శక్తి విజయ ప్రస్థానానికి మార్గదర్శిగా, చిరునామాగా మారిన ఏపిమాస్ ఈ చారిత్రక ఘట్టానికి చేరువైన వేళ, దేశ విదేశాలలోని పలువురు మిత్రులు, శ్రేయోభిలాషులు, భాగస్వాములు, అభివృద్ధి రంగ నిపుణులు, మేధావులు, ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థల ప్రతినిధులు ఏపిమాస్‌కు అభినందనలు అందిస్తున్నారు, విశ్లేషిస్తున్నారు, సూచనలు చేస్తున్నారు, భవ్య భవిష్యత్‌కు ఆశీర్వచనాలు అందిస్తున్నారు. మహిళా స్వయంసహాయ రంగం, వాటర్‌షెడ్స్, ఆదర్శ గ్రామ నిర్మాణం, జీవనోపాధుల కల్పన, పారిశుధ్య పరిరక్షణ, గర్భిణులు, కిశోర బాలికలకు ఆరోగ్య సంరక్షణ, పోషకాహారం, వాష్ ప్రాజెక్ట్, యువతకు నైపుణ్య శిక్షణ, విద్యాలయాలలో మౌలిక వసతుల ఏర్పాటు, ఎఫ్ పి ఓలు, పి4, యిలా వివిధ రంగాలలో ఏపిమాస్ సాగించిన, సాగిస్తున్న కృషిని కొనియాడుతున్నారు. ఏపిమాస్ విజయ ప్రస్థానంలో వీరందరూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పాత్రధారులే. వీరి అభినందనలను, ఆశీర్వచనాలను ఏపిమాస్ వినమ్రంగా స్వీకరిస్తున్నది. వీరందరికి హృదయపూర్వక ధన్యవాదాలు. ఆంగ్లంలో వీరు అందించిన అభినందన సందేశాలను ప్రత్యేక పుస్తక రూపంలో ఏపిమాస్ తీసుకువస్తున్నది. ఆ సందేశాలను క్లుప్తంగా ఈ సంచికలో ప్రచురిస్తున్నాం. ఒక విషాదం. ప్రముఖ పర్యావరణ వేత్త, సుస్థిర వ్యవసాయ మార్గదర్శి, గ్రామీణాభివృద్ధి ఉద్యమకారుడు శ్రీ కె ఎస్ గోపాల్ 2026 మే నెల 16 వ తేదీన క్యాన్సర్‌తో కన్ను మూశారు. ఏపిమాస్‌తో ఆయనకు ఆత్మీయ అనుబంధం వుంది. అంతటి తీవ్ర అనారోగ్య స్థితిలో పడకకే పరిమితమై వుండి కూడా, ఏపిమాస్ రజితోత్సవ సందర్భంగా ఏపిమాస్‌తో తన అనుబంధాన్ని గురించి, 25 ఏళ్ళ ప్రస్థానాన్ని గురించి తాను వ్యాసం వ్రాసి తీరవలసిందేనని, దానిని ఎడిట్ చేయకుండా ప్రచురించాలని శ్రీ గోపాల్ పట్టుపట్టారు. అదేవిధంగా, ఎంతో శ్రమకోర్చి వ్యాసం వ్రాశారు . ఆయన కోరినట్టుగానే ఆ వ్యాసాన్ని పూర్తిగా ప్రచురిస్తున్నాం. సమాజ హితం కోసం వెరపెరుగని కృషీవలుడు, అసాధారణ ఆలోచనశీలి శ్రీ కె ఎస్ గోపాల్‌కు ఏపిమాస్ స్మృత్యంజలి ఘటిస్తున్నది. ఆయన కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతి. ఏ ఆశయ సాధనకోసం 25 సంవత్సరాలుగా ఏపిమాస్ అత్యంత క్రియాశీలంగా, ఫలప్రదంగా కృషిచేస్తున్నదో, సత్ఫలితాలను సాధిస్తున్నదో అదే మార్గంలో మరింత దీక్షా దక్షతలతో తన కృషిని కొనసాగించడానికి ఏపిమాస్ సమాయత్తమవుతున్నది. ఇప్పటివరకు మాదిరిగానే ఏపిమాస్‌కు మీరందరూ ఇకపై కూడా తోడ్పాటు అందివ్వాలని కోరుతున్నది.



**Edited, Printed, Published and owned by T.Chandra Sekhar Reddy; Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No.CFC-1&2, Survey No.18, E-city, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, Telangana - 501359 and Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally, Manikonda,Ranga Reddy District,Telangana-500089. Editor:T.Chandra Sekhar Reddy**

సాధించడం కష్టమనిపిస్తే మీ నైపుణ్యాన్ని పెంచుకోవాలి, లేకుంటే మీ కలను కుదించుకోవాలి

# మహిళా సాధికారత


ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

**ఎడిటోరియల్ కమిటి: జి. శ్రీనివాస్, ఎల్. భవాని, ఆర్ రమాదేవి, ఎం. భార్గవి, కె శ్రీనివాస్, ఆర్ బ్రహ్మాచారి**

**కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి , కన్సల్టెంట్ : కె. రఘురామరాజు**

**సాంకేతిక సహకారం: క్రిస్టోఫర్ వసంత్**


## లోపలి పేజీలలో ....


- ఏపిమాస్ విజయ సాధక 'పంచామృతం'! 05
- చెక్కు చెదరని నైతిక విలువల ఏపిమాస్! 06
- విధానాల రూపకల్పనపై ఏపిమాస్ ప్రభావం 07
- సమగ్ర దృక్పథంతో సేవలందిస్తున్న ఏపిమాస్ 08
- వివిధ వ్యవస్థలకు విస్తరణ తీరు అమోఘం! 09
- జి ఓ-ఎన్ జి ఓ సమన్వయానికి మూలాధారం! 10
- స్వయం నియంత్రణ సూత్రధారి ఏపిమాస్ ! 12
- సి ఎస్ రెడ్డి వ్యక్తిత్వమే ఏపిమాస్ మూలబలం! 13
- సమాజ సాధికారతకు 25 వసంతాల అంకిత యాత్ర ! 14
- సుస్థిర ప్రారంభం...25 ఏళ్లుగా కొనసాగుతున్న విలువలు! 15
- ఇరవై ఐదు సంవత్సరాలుగా ప్రజలతో మమేకమైన ప్రయాణం! 16
- శిఖరారోహణలో ఆరితేరి, రజితోత్సవ సంస్థగా తీర్చిదిద్ది! 17
- పేదప్రజలకు పెనుమార్పు సృష్టికర్తలుగా మార్గదర్శనం! 18
- ప్రభుత్వాలకు, సామాజిక సంస్థలకు ప్రేరణ శక్తి ఏపిమాస్ ! 19
- సంస్థాగత ఆవిష్కరణలలో అగ్రగామి ఏపిమాస్ ! 20
- సంస్థను మించి, ఉద్యమ శక్తి కేంద్రంగా ఎదిగి ... ! 21
- ప్రచార ఆర్భాటం లేకుండా సాధించిన గుర్తింపు! 22
- గ్రామీణ మహిళల ముఖాల్లో చిరునవ్వులు చిందించిన విజయం! 23
- పర్యావరణ ఉద్యమనేత కె. ఎస్. గోపాల్ కన్నుమూత 24
- అభివృద్ధి రంగంలో ఒక భిన్నమైన ప్రజాస్వామ్య సంస్థ ! 25
- తల్లి పాల ప్రాముఖ్యతపై ఆశాలకు అవగాహన సందర్శన 27
- రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం 28
- ఘనంగా దహేగాం, ఉద్వల ఎఫ్ పి సిల వార్షిక మహాసభలు! 29
- సామాజిక బాధ్యతను చాటిన విప్రో ఉద్యోగుల సేవా కార్యక్రమం 32
- శ్రీ సి.ఎస్. దంపతుల కైలాస-మానస సరోవర యాత్ర 33


## 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశం లోని ఇతర అనేక రాష్ట్రాలలో మహిళా స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడంకోసం 'మహిళా సాధికారత 'పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.

| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | | |
|---|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : | రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : | రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : | రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరు మీద పంపాలి**


మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org



**దురాశకంటె నిరాశ మరింత చెడ్డది ... అది మన సర్వశక్తులను కుంగదీస్తుంది**

# ఏపిమాస్ విజయ సాధక 'పంచామృతం' !

**– విజయ్ మహాజన్**

ఏపిమాస్ రజితోత్సవం సందర్భంగా వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు తమ అభినందనలు తెలిపారు, ఆశీస్సులు అందించారు, ఈ సంస్థ మరింత బలోపేతమై చిరకాలం సమాజానికి సేవలు అందించాలని ఆకాంక్షించారు. వారు ఆంగ్లంలో అందించిన ఆ సందేశాలను ఆంగ్లంలో ఒక పుస్తక రూపంలో ఏపిమాస్ ప్రచురిస్తున్నది. వారి ఆ భావ వ్యక్తీకరణలను 'మహిళా సాధికారత' పాఠకులకోసం ఈ సంచికలో తెలుగులో 'రజితోత్సవ సందేశం' శీర్షికన క్లుప్తంగా ప్రచురిస్తున్నాం .

ఒక సంస్థ 25 సంవత్సరాల పాటు తన ప్రభావాన్ని చూపుతూ కొనసాగడానికి కారణం ఏమిటి? అనేక సంస్థలు కొనసాగుతాయి గానీ, తమ స్థాపన లక్ష్యాన్ని, స్ఫూర్తిని, విలువలను యిలా మూడో దశాబ్దంలో కూడా నిలబెట్టుకోవడం చాలా అరుదు. ఏపిమాస్ రజతోత్సవ వేడుకల సందర్భం నాలో ఈ ప్రశ్నను రేకెత్తించింది. దీని ప్రధాన రహస్యం "మార్పుతో కూడిన నిరంతరత్వం" (చేంజ్ విత్ కంటిన్యుటి). సమర్థవంతమైన సంస్థలు కాలానుగుణంగా తమ వ్యూహాలను మార్చుకుంటూనే, తమ స్థాపక లక్ష్యానికి, మౌలిక విలువలకు కట్టుబడే ఉంటాయి. ఏపిమాస్ దీర్ఘకాల సమర్థతకు కారణం కేవలం మంచి పాలన మాత్రమే కాదు. సంస్థ అసలైన ప్రత్యేకత గ్రామీణ సమాజానికి, ముఖ్యంగా మహిళలకు దగ్గరగా ఉండడంలో ఉంది. సంస్థ సి ఇ ఓ, సీనియర్ మేనేజ్‌మెంట్ బృందం ఎక్కువగా గ్రామాల్లో గడుపుతూ మహిళలతో, రైతులతో, సంఘాలతో నిరంతరం మమేకమవుతుంటారు.



శ్రీ విజయ్ మహాజన్
ఏపిమాస్ సహ వ్యవస్థాపకులు

రజతోత్సవ సందేశం!

ఏపిమాస్ కు వున్న మరో మంచి లక్షణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలతో, వివిధ ప్రభుత్వేతర సంస్థలతో కలసి పనిచేయగలగడం. రిజర్వ్ బ్యాంక్, నాబార్డ్, ఎస్ ఎఫ్ ఏ సి, సెర్ప్, జీవిక వంటి ప్రభుత్వ సంస్థలతోను, వాసన్, ప్రదాన్, ఏ కె ఆర్ ఎస్ పి, సా-ధన్, ఎం టి ఐ ఎన్, ఎన్ ఏ ఎఫ్ పి ఓ వంటి తోటి నిర్వాహక, అభివృద్ధి రంగ సంస్థలతోను ఏపిమాస్ కలిసి పనిచేస్తుండడం విశేషం. ఇంతే కాకుండా కార్పొరేట్ సంస్థలతో కూడా కేవలం నిధులకోసం కాకుండా ఆశించిన ఫలితాల సాధక సంస్థగా కలిసి పనిచేయగలుతున్నది.

ఏపిమాస్ విజయానికి ఒక 'పంచామృతం' మూలం! ఆ పంచామృతం ఏమిటంటే ....

1. విలువలు, లక్ష్యాలలో నిరంతరత్వంతో కూడిన వ్యూహాత్మక మార్పు
2. సమాజంతో నిరంతర అనుబంధం
3. శిక్షణ, ఆత్మపరిశీలన ద్వారా సామర్థ్య వృద్ధి
4. స్వీయ అనుభవాల నుంచి, ఇతరుల అనుభవాల నుంచి నిరంతర అభ్యాసం
5. ఒకే లక్ష్యంతో పనిచేసే సంస్థలతో విస్తృత సహకారం

ఈ 25వ వార్షికోత్సవ సందర్భంగా బోర్డు సభ్యులకు, సి ఇ ఓ కు, సీనియర్ మేనేజ్‌మెంట్‌కు, మొత్తం ఏపిమాస్ బృందానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు. మరిన్ని దశాబ్దాల పాటు మీరు సమాజానికి మార్గదర్శక సేవలు అందించాలని కోరుకుంటున్నాను.

ఒక అభిమానిగా చివరగా నేను చెప్పదలచుకున్నది –

సిఎస్ ... ఈ 25 సంవత్సరాల పాటు మీరు ఏపిమాస్‌కు చిరస్థాయి నాయకత్వం అందించారు. ఇకమీదట మీ తదుపరి గొప్ప కృషి, ఏపిమాస్ భవిష్యత్తును నడిపించగల సమర్థ వారసుడిని తయారు చేయడం కావాలి. ■

మూర్ఖుల మధ్య తెలివిగా వెలిగిపోయేవారు, తెలివిగలవారి మధ్యలో మూర్ఖులుగా మిగిలిపోతారు

# చెక్కు చెదరని నైతిక విలువల ఏపిమాస్!

ఏపిమాస్‌కు అద్భుతమైన సేవా చరిత్ర ఉంది. దాని అత్యంత గర్వకారణమైన ప్రత్యేకత (యుఎస్‌పి) ఎప్పటికీ చెక్కు చెదరని దాని నైతిక విలువలు. ఈ స్థాయి సాధ్యమవడానికి విజయ్ మహాజన్, సి.ఎస్. రెడ్డి, సమర్జిత్ రే, నందితా రే, కోటయ్య, కె. రాజు, ఎస్.పీ. టక్కర్ తదితర వ్యవస్థాపకుల సహానుభూతి, నిజాయితీ, నిబద్ధత ప్రధాన కారణాలు. పేదల అభ్యున్నతికి వారు చూపిన అంకితభావం అపూర్వమైనది. గత బోర్డు డైరెక్టర్లు , ప్రస్తుత బోర్డు డైరెక్టర్లు కూడా అదే నిబద్ధతతో, ఉత్సాహంతో ఈ బాధ్యతను ముందుకు తీసుకెళ్తున్నారు.



కె. మాధవరావు
ఏపిమాస్ ఛైర్మన్

ఏపిమాస్ పనిచేస్తున్న రంగాలు ప్రశంసనీయమైనవి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద మహిళల జీవనోపాధిని మెరుగుపరచడానికి, కొంతవరకు పట్టణ మురికివాడల మహిళలను కూడా చేర్చుకుని, వారిని సాధికార స్వయం సహాయక సంఘాలుగా (ఎస్ హెచ్ జి లుగా) ఏర్పరచడంలో ఇది కీలక పాత్ర పోషిస్తోంది. సమావేశాలు నిర్వహించడం, లెక్కల పుస్తకాలు నిర్వహించడం, చిన్న రుణాల కోసం బ్యాంకులతో సమర్థవంతంగా మమేకం కావడం వంటి విషయాలలో వారికి శిక్షణ అందిస్తోంది. అలాగే, వారి ఉత్పత్తుల మార్కెటింగ్‌కు అనువైన అవకాశాలను గుర్తించడంలో సహకరిస్తోంది.

**రజతోత్సవ సందేశం!**

ఇంకా ముఖ్యంగా, మహిళలు తమ హక్కులను తెలుసుకుని, వాటిని సాధించడానికి, పరిరక్షించడానికి కృషి చేసేలా ఏపిమాస్ ప్రోత్సహిస్తోంది. ఇది చురుకైన హక్కుల పరిరక్షణ సంస్థగా ఎదిగి, దేశవ్యాప్తంగా ఇలాంటి అనేక సంస్థలతో విస్తృత నెట్‌వర్క్‌ను ఏర్పరచుకుంది. ఇటీవలి కాలంలో, పట్టణ మురికివాడలలో పోషకాహార కార్యక్రమాలు, వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్‌పిఓల) వంటి రంగాలకు కూడా ఏపిమాస్ తన కార్యకలాపాలను విస్తరించింది. గత రెండున్నర దశాబ్దాలుగా దాని ప్రయాణం స్థిరమైనది, గౌరవప్రదమైనది, అర్థవంతమైనది. భవిష్యత్తులో కూడా ఇదే నిబద్ధతతో, సమర్థతతో ఏపిమాస్ సమాజానికి సేవలను కొనసాగిస్తుందని నాకు పూర్తి నమ్మకం ఉంది. ■

## మహిళలను శక్తిశాలులురుగా మార్చిన ఉద్యమం ఏపిమాస్!

ఏపిమాస్ తన 25 ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న ఈ సందర్భంలో, నేను దీన్ని కేవలం ఒక సంస్థ ప్రయాణంగా కాకుండా, వేలాది గ్రామీణ మహిళల జీవితాలను శక్తివంతంగా మార్చిన ఒక ఉద్యమంగా చూస్తాను. ఈ సంవత్సరాలుగా, ఏపిమాస్ మహిళల్లో బలాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, సామూహిక సంకల్పాన్ని పెంపొందించింది. వారు కలిసి "సాధికారత" అనే భావనకు కొత్త అర్థాన్ని యిచ్చారు. మహిళలు తమ ఖాతాలను స్వయంగా నిర్వహిస్తున్నారు, బ్యాంకులతో ధైర్యంగా వ్యవహరిస్తున్నారు, తమ సంస్థల్లో జవాబుదారీతనాన్ని పాటిస్తున్నారు. ఇది మహిళలు తమ సామూహిక స్వరాన్ని కనుగొని వినియోగించుకున్న సాధికారత కథ! నా దృష్టిలో ఏపిమాస్ చేసిన, చేస్తున్న అత్యంత శాశ్వతమైన సేవ ఇదే! ఈ 25 సంవత్సరాలుగా, ఏపిమాస్ మొత్తం అభివృద్ధి రంగానికి విలువైన పాఠాలను అందించింది. ఈ ప్రయాణాన్ని ముందుకు నడిపించిన వేలాది మహిళలకు, నిశ్శబ్దంగా కృషి చేసిన బృందాలకు, తన నిజాయితీ, దూరదృష్టి, నిబద్ధతతో ఏపిమాస్ ను ముందుకు నడిపించిన సి.ఎస్. రెడ్డి గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు, అభినందనలు. ■



గౌరీ కృష్ణ
ఏపిమాస్ బోర్డ్ సభ్యురాలు

# విధానాల రూపకల్పనపై ఏపిమాస్ ప్రభావం

**నే**ను 2015లో ఏపిమాస్‌లో చేరాను. అంతకుముందు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కర్ణాటకలో చీఫ్ జనరల్ మేనేజర్‌గా పనిచేసిన సమయంలో స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) ఉద్యమంతో నాకు వ్యక్తిగత అనుబంధం ఏర్పడింది. పేదరిక నిర్మూలన, ఆర్థిక సమగ్రత లక్ష్యాలతో మహిళలను అగ్రశ్రేణి నాయకులుగా తీర్చిదిద్దుతున్న ఈ సామాజిక ఉద్యమం నాకు ఎంతో ప్రేరణనిచ్చింది.



**మహపరా అలీ**
**ఏపిమాస్ వైస్ ఛైర్‌పర్సన్**

ఆ సమయానికి ఈ ఉద్యమం వేగంగా విస్తరిస్తూ, మహిళా సమూహాల శక్తిని, ప్రభావాన్ని దేశ సామాజిక, రాజకీయ రంగాల్లో స్పష్టంగా చూపిస్తోంది. ఇది ప్రజలను పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చి జీవనోపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా, మద్యపానం, నిరక్షరాస్యత, పారిశుద్ధ్యం, వాతావరణ మార్పులు, సురక్షిత తాగునీటి లభ్యత, పోషకాహార లోపం వంటి సామాజిక సమస్యల పరిష్కారంలో కూడా సహకరించింది. మెరుగైన వ్యవసాయ పద్ధతుల ద్వారా పేదరిక నిర్మూలనలోనూ కీలక పాత్ర పోషించింది.

**రెండు ముఖ్య ఫలితాలు –** ఒక బ్యాంకర్‌గా ఆదాయ రహిత ఆస్తులు (ఎన్ పి ఏ లు) అత్యల్ప స్థాయిలో వుండడం, పొదుపు అలవాటు పెరగడం; ఒక మహిళగా చూస్తే, లైంగిక సమానత్వం, మహిళల ఆత్మవిశ్వాసం పెంపొందడం నన్నెంతో ఆకట్టుకున్న అంశాలు.

సి ఇ ఓ శ్రీ సి.ఎస్. రెడ్డి గారిని మొదటిసారి కలిసిన వెంటనే ఆయన అభిరుచి, నిబద్ధత స్పష్టంగా కనిపించాయి. ఎస్ హెచ్ జి ఉద్యమంలో నేను గమనించిన నాయకత్వ అభివృద్ధిలో, నైపుణ్య శిక్షణలలో లోపం, వ్యవస్థలు, విధానాల పట్ల శ్రద్ధ లేమి, ఫలితాల సాధనలో, లెక్కల నిర్వహణలో నాణ్యత కొరవడడం, ప్రభుత్వం, మార్కెట్లు, బ్యాంకుల వంటి వివిధ భాగస్వాములతో తగిన అనుసంధానం లేకపోవడం వంటి బలహీనతలను ఏపిమాస్ సమర్థంగా ఎదుర్కొంటున్నదని నాకు అనిపించింది.

ఏపిమాస్‌కు లభించిన అత్యంత ముఖ్యమైన గుర్తింపు విధాన నిర్ణయ ప్రక్రియలో దాని భాగస్వామ్యం. సి.ఎస్. రెడ్డి గారు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ విధాన సమావేశాల్లో పాల్గొనడం, సదస్సుల్లో పత్రాలు సమర్పించడం, వివిధ భాగస్వాములతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడం, రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్ పి ఓల)అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా సిబిబిఓగా బాధ్యతలు స్వీకరించడం ఇలాంటివన్నీ ఈ కోవకు చెందినవే.

రజతోత్సవ సందేశం!

ఇప్పుడు, పది సంవత్సరాల తర్వాత, నా అంచనా సరిగానే ఉందని నిశ్చయంగా చెప్పగలను. ఏపిమాస్ ఈ రంగంలో ప్రభావవంతమైన, విశ్వసనీయ సంస్థగా గుర్తింపు పొందింది. ఉపాధ్యక్షురాలిగా ఈ ప్రయాణంలో భాగస్వామ్యురాలిగా ఉండటం నాకు గర్వకారణం. ఈ కాలంలో సంస్థ బ్యాలెన్స్ షీట్ రెండింతలు పెరగడమే కాకుండా, దాని పనితీరుకు, ప్రభావానికి విస్తృతమైన గుర్తింపు లభించింది

ఏపిమాస్ యిప్పుడు కేవలం ఆర్థిక స్వావలంబనకే పరిమితం కాకుండా, జీవనోపాధి, విద్య, పారిశుద్ధ్యం, పరిశుభ్రత, పోషకాహారం, మాతా–శిశు ఆరోగ్యం, సురక్షిత తాగునీటి లభ్యత వంటి జీవితాన్ని మార్చే అంశాల్లోనూ మార్పుకు దోహదపడుతోంది.

ఏపిమాస్ తన రజతోత్సవ సంవత్సరంలో మరింత నూతన ఉత్సాహంతో, దృఢ సంకల్పంతో ఈ రంగంలో మరింత బలమైన నాయకత్వ పాత్రను స్వీకరించాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నాను. ■

వెలుగును కొందరు చూడలేకపోయినంతమాత్రాన, అది వెలుగు కాకుండా పోదు

# సమగ్ర దృక్పథంతో సేవలందిస్తున్న ఏపిమాస్

**వ్య**వస్థాపక బోర్డు సభ్యురాలిగా, ఏపిమాస్ తో నాకు ప్రత్యేకమైన, నిరంతరమైన అనుబంధం ఉంది. అది నేటికీ అనేక రూపాల్లో కొనసాగుతూనే ఉంది. సంస్థ ఆవిర్భావం నుండి సీఈఓగా ఉన్న శ్రీ సి.ఎస్. రెడ్డి గారి నాయకత్వంలో, అలాగే నిబద్ధతతో కూడిన డైరెక్టర్ల బోర్డు ఆధ్వర్యంలో, గత పావు శతాబ్ద కాలంగా ఏపిమాస్ అభివృద్ధి చెందుతూ, వికసిస్తూ వచ్చిన తీరు నేను దగ్గరగా గమనించాను. ఏపిమాస్ అనేక దాతృత్వ సంస్థలతో , అభివృద్ధి భాగస్వాములతో బలమైన సంబంధాలను కొనసాగించింది.



**నందితా రే**
**ఏపిమాస్ బోర్డు సభ్యురాలు**

గ్రామీణ మహిళల స్వయం సహాయక ఉద్యమాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో, 2001లో ఏపిమాస్ తన ప్రయాణాన్ని ప్రారంభించింది. నేడు సమాజ అవసరాలకు అనుగుణంగా రూపొందించిన కార్యక్రమాల ద్వారా సుమారు 5-7 లక్షల కుటుంబాలకు ఏపిమాస్ సేవలందిస్తోంది. ఆరు లక్షలకుపైగా నిపుణులకు శిక్షణ ఇచ్చింది. 88 పరిశోధనాత్మక అధ్యయనాలు నిర్వహించి, 75 ప్రచురణలను వెలువరించింది. ఈ పరిశోధనల ఫలితాలు విధాన నిర్ణేతలకు, అభివృద్ధి సంస్థలకు, పరిశోధకులకు ముఖ్యమైన జ్ఞాన సంపదగా మారింది.

ఏపిమాస్ 2002 నుండి 'మహిళా సాధికారత' మాసపత్రికను ప్రచురిస్తున్నది. పేదరిక నిర్మూలన, మహిళల సాధికారత, జీవనోపాధి, సామాజిక అభివృద్ధి వంటి అంశాలపై ఈ పత్రిక ముఖ్యమైన చర్చలకు వేదికగా నిలిచింది.

ఏపిమాస్‌కు వున్న అత్యంత విశిష్ట లక్షణం దాని సమగ్ర దృక్పథం. కేవలం "వ్యాప్తి"కే పరిమితం కాకుండా, సామాజిక సంస్థలు స్వయం సమృద్ధితో, నిలకడగా కొనసాగేందుకు అవసరమైన అన్ని రకాల సామర్థ్యాలను అభివృద్ధి చేయడంపై ఇది దృష్టి సారిస్తుంది.

ప్రస్తుతం ఏపిమాస్ వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థల (FPOs) కోసం సమగ్ర సేవా వ్యవస్థను రూపొందించడానికి కృషి చేస్తున్నది. ముఖ్యంగా, మహిళా రైతులకు కీలక పాత్రను కల్పించడానికి ఏపిమాస్ విశేష కృషి చేస్తోంది. గ్రామీణ వ్యవసాయ కుటుంబాల్లో మహిళల పాత్ర ఎంతో కీలకమైనదైనా, నిర్ణయాధికారంలో వారు తరచుగా వెనుకబడిపోతున్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు మహిళలకు

రజతోత్సవ సందేశం!

ఎఫ్‌పిఓ బోర్డుల్లో ప్రాతినిధ్యం కల్పించడం, పూర్తిగా మహిళలతో కూడిన ఎఫ్ పి ఓలను ప్రోత్సహించడం వంటి చర్యలను ఏపిమాస్ చేపడుతోంది. నాబార్డ్ సహకారంతో, దేశంలోని ఉత్తమ స్వయంసహాయ సమాఖ్యలను గుర్తించి, ప్రోత్సహించేందుకు ఏపిమాస్ ప్రత్యేక అవార్డులను ప్రారంభించింది. ఈ కార్యక్రమం గ్రామీణ స్థాయి పాలన, సమూహ నాయకత్వం, పారదర్శకత, జవాబుదారీతనాన్ని ప్రోత్సహించడంలో ముఖ్యమైన పాత్ర పోషించింది.

ఏపిమాస్ ఇప్పటికీ స్మరజిత్ రే స్మారక ప్రసంగాన్ని కొనసాగిస్తుండడం నాకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ వేదిక ద్వారా గ్రామీణాభివృద్ధికి సంబంధించిన విభిన్న అంశాలపై ప్రముఖులు తమ జ్ఞానాన్ని, అనుభవాలను పంచుకుంటున్నారు.

ఏపిమాస్ , దాని భాగస్వాములు ఇదే దృఢ సంకల్పంతో ఈ గొప్ప ప్రస్థానాన్ని కొనసాగించాలని, రాబోయే సంవత్సరాల్లో ఈ లక్ష్యాలు మరింత విస్తృతంగా సాకారమవాలని నేను హృదయపూర్వకంగా ఆశిస్తున్నాను.

■

# వివిధ వ్యవస్థలకు విస్తరణ తీరు అమోఘం!

**మ**హిళలను సంఘటితపరచి, వారి సామర్థ్యాలను పెంపొందించి, ప్రభుత్వాల, సామాజిక సంస్థల భాగస్వామ్యంతో వారు ఆర్థిక , జీవనోపాధి వనరులను పొందే విధంగా తీర్చిదిద్ది, 25 సంవత్సరాలుగా మహిళా సాధికారతకు అంకితభావంతో ఏపిమాస్ చేస్తున్న సేవలకు హృదయపూర్వక అభినందనలు.



టి. విజయకుమార్
వైస్ ఛైర్మన్-ఆర్ వై ఎస్ ఎస్

రజతోత్సవ సందేశం!

శ్రీ సి.ఎన్. రెడ్డి (సి.ఎస్.) గారిని నేను 30 సంవత్సరాలకు పైగా ఎరుగుదును. మహిళల స్వయం సహాయక సంఘాలు, సమాఖ్యలపై దృష్టి కేంద్రీకరించిన సంస్థగా ప్రారంభమైన ఏపిమాస్‌ను, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్ పి ఓలు), వ్యవసాయ విలువ గొలుసు వంటి అనేక విభాగాలకు విస్తరించేలా ఆయన నడిపించిన తీరు నిజంగా విశేషమైనది.

ఏపిమాస్ లో క్షేత్ర స్థాయి అనుభవం కలిగి ఉండటంతో పాటు ఉన్నత విద్యార్హతలు కలిగిన బలమైన కార్య నిర్వాహక బృందం ఉంది. ఏపిమాస్ బృందంతో, అలాగే సి.ఎస్. గారితో ఉన్న అనుభవాలు నాకు ఎంతో మధురమైన జ్ఞాపకాలు.

అయితే, ప్రస్తుతం కొత్త సవాళ్లు ముందుకు వస్తున్నాయి. వాటికి అనుగుణంగా ఏపిమాస్ కొత్త దిశల్లో ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. అందులో ముఖ్యమైనది వాతావరణ సంక్షోభం. ఇది గ్రామీణ వ్యవసాయ జీవనోపాధులను, మానవ ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. మానవజాతి మొత్తానికి ఇది అత్యంత తీవ్రమైన అస్తిత్వ సంక్షోభం. గత పది సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ సామాజిక నిర్వహణలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాన్ని అమలు చేసిన అనుభవంతో, ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు మహిళా స్వయం సహాయక సంఘాలు అత్యంత అనుకూలమైన వ్యవస్థలుగా నేను గమనించాను.

భవిష్యత్ సవాళ్లను సృజనాత్మకంగా ఎదుర్కొంటూ ఏపిమాస్ తన ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగించాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నాను.

## కార్యక్రమాల నాణ్యతలో రాజీపడని ఏపిమాస్

**అ**నంతపురం జిల్లాలో ఏపిమాస్ అమలు చేసిన వాతావరణ పరిరక్షణ ప్రాజెక్ట్ సాంకేతిక సలహా కమిటీ సభ్యులుగా మేము ఏపిమాస్ కుటుంబంలో భాగమయ్యాము. ఈ ప్రాజెక్టును కమిటీ లేకుండానే ఏపిమాస్ అమలు చేయగలిగేది. అయినప్పటికీ, వ్యవసాయం, వాతావరణ మార్పులు, నీటి నిర్వహణ, కమ్యూనిటీ సంస్థీకరణ వంటి రంగాల నిపుణులను కలిపి పని చేయాలని ఏపిమాస్ నిర్ణయించడం కార్యక్రమాల నాణ్యతకు,చేపట్టిన పనులు కూలంకషంగా సాగాలన్న ఏపిమాస్ సంకల్పానికి తార్కాణాలు.వాతావరణ మార్పులకు అనుగుణమైన ప్రాజెక్టులను రూపకల్పన చేయడం, అమలు చేయడం సహజంగానే క్లిష్టమైన ప్రక్రియలు అయినప్పటికీ, వాతావరణ ప్రమాదాలను తగ్గించేందుకు ఏపిమాస్ తన వంతు కృషి చేసింది. ఇటువంటి చర్యల ప్రభావం కనిపించడానికి ఎక్కువ కాలం పట్టినా, ప్రస్తుత వాతావరణ అస్థిరతలను ఎదుర్కొనే ప్రయత్నాలు ప్రశంసనీయమైనవే. ■





ఎన్. హెచ్. రవీంద్రనాథ్
బి.ఎస్.సుష్మా: ఐ ఐ ఎస్

# జి ఓ-ఎన్ జి ఓ సమన్వయానికి మూలాధారం!

గత 25 సంవత్సరాలుగా నిధుల సమీకరణ నుంచి కోవిడ్ -19 ప్రభావాలను ఎదుర్కొనడం వరకు అనేక సవాళ్లను అధిగమిస్తూ సి ఎస్ రెడ్డి ఏపిమాస్‌ను ముందుకు నడిపించారు. ఆయనకు నా హృదయపూర్వక అభినందనలు.

ఏపిమాస్ పని విధానంలో ఒక ప్రధాన లక్షణం నాకు ప్రత్యేకంగా కనిపిస్తుంది. అదే – ప్రభుత్వం – పౌరసమాజ సంస్థలు (ఎన్ జి ఓలు, ఎస్ హెచ్ జి లు, ఎఫ్ పి ఓలు మొదలైనవి) పరస్పరం సహకరించి, తమ బలాలను సమన్వయం చేసుకోవడం ద్వారా సామాజిక అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలి అనే తపన.సి ఎస్ రెడ్డి దూరదృష్టి, సమర్థ నాయకత్వం వల్ల ఏపిమాస్ ఈ కృషిలో విజయవంతమైంది. గత 25 సంవత్సరాలలో ఏపిమాస్ ప్రభుత్వంతో అనేక ఫలవంతమైన భాగస్వామ్యాలను నిర్మించింది. వాటిలో కొన్ని :



ఆలోయ్‌సియస్ ఫెర్నాండెజ్-పద్మశ్రీ పురస్కార గ్రహీత

రజతోత్సవ సందేశం!

1. సెర్ప్ తో ఒప్పందం కుదుర్చుకుని, వెలుగు/సెర్ప్ సిబ్బందికి శిక్షణ అందించేందుకు జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్స్ ను సిద్ధంచేసింది.

2. వ్యవసాయశాఖతో కలిసి రైతు మిత్ర గ్రూపుల ఏర్పాటు కోసం మార్గదర్శకాలను రూపొందించింది.

3. మెప్మాతో కలిసి పట్టణ ప్రాంతాలలో ఎస్ హెచ్ జి లను, వాటి సమాఖ్యలను ప్రోత్సహించింది.

4. ఎన్ ఆర్ ఎల్ ఎమ్ స్థాయిలో ఏపిమాస్ ఒక జాతీయ వనరుల సంస్థ (ఎన్ ఆర్ ఓ) గా గుర్తింపు పొందింది.ఎస్ హెచ్ జి సమాఖ్యలకోసం స్వయం నియంత్రణ (సెక్టర్ ఓన్ కంట్రోల్) అనే భావనను ప్రయోగాత్మకంగా ప్రారంభించి విస్తరించింది. ■

## శాస్త్రవేత్తలకే మార్గదర్శనంచేసిన ఏపిమాస్ !

2000ల మధ్యకాలంలో దేశవ్యాప్తంగా వాటర్‌షెడ్ కార్యక్రమాలు వేగంగా అమలవుతున్న సమయంలో నాకు ఏపిమాస్‌తో పరిచయం ఏర్పడింది. క్రిడా (సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్) వాటర్‌షెడ్ కార్యక్రమాలు మరియు మెట్ట భూమి వ్యవసాయంపై శిక్షణలను నిర్వహించేది. ఆ శిక్షణల్లో ఏపిమాస్ ప్రాజెక్టు సిబ్బంది ఎంతో చురుకుగా పాల్గొనడం నాకు గుర్తుంది. తరువాత 2008లో నేను CRIDA డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత, ఏపిమాస్ సీఈఓ శ్రీ సి.ఎస్. రెడ్డిగారితో అనేక సందర్భాల్లో అనుబంధం ఏర్పడింది. వాటర్‌షెడ్ కార్యక్రమాల్లో జీవనోపాధి అంశాలను సమగ్రపరచేందుకు మా క్రిడా శాస్త్రవేత్తలు ఏపిమాస్ నుంచి అనేక మార్గదర్శకాలను స్వీకరించారని నేను ఎలాంటి సందేహం లేకుండా చెప్పగలను.వాతావరణ మార్పులకు అనుగుణంగా మారడంపై రైతులలోని చైతన్యం, ప్రాజెక్టు సిబ్బంది పాల్గొనే విధానం నాకు ఎంతో సంతృప్తినిచ్చింది. 25 సంవత్సరాల విజయవంతమైన ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న ఈ సందర్భంగా ఏపిమాస్ కు ఉజ్వలమైన , ఫలప్రదమైన భవిష్యత్తు ఉండాలని నేను ఆకాంక్షిస్తున్నాను.



డా. బి. వెంకటేశ్వర్లు
మాజీ డైరెక్టర్, క్రిడా

# జి ఓ-ఎన్ జి ఓ సమన్వయానికి మూలాధారం!

**ఏ** సంస్థకైనా ఇరవై ఐదు సంవత్సరాలు పూర్తి కావడం ఒక ముఖ్యమైన మైలురాయి. ముఖ్యంగా దేశవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జి) ఉద్యమాన్ని, సమాజాధారిత సంస్థలను నిశ్శబ్దంగానే,నిరంతరం ప్రభావితం చేసిన ఏపిమాస్ వంటి సంస్థకు ఇది మరింత విశిష్టమైన ఘట్టం. స్వయంగా నా అనుబంధం ఏపిమాస్‌తో దాదాపు దశాబ్ద కాలం కొనసాగింది. 2007 జులై నుండి 2016 ఆగస్టు వరకు ఏపిమాస్ బోర్డు సభ్యురాలిగా పనిచేసే అవకాశం నాకు లభించింది. ఈ కాలంలో జర్మనీలోని డి జి ఆర్ వి అధ్యయన పర్యటన కూడా ఒక ముఖ్యమైన అనుభవం.



డా. సుధా కోఠారి
ఏపిమాస్ బోర్డ్
మాజీ సభ్యురాలు

ఏపిమాస్‌ను ప్రత్యేకంగా నిలబెట్టింది దాని స్పష్టమైన సంస్థాగత దృష్టి. కేవలం ప్రాజెక్టుల అమలుపైనే దృష్టి పెట్టకుండా, వ్యవస్థలు, ప్రమాణాలు, అభ్యాస ప్రక్రియలు, బాధ్యతాయుత విధానాల నిర్మాణంలో ఏపిమాస్ గణనీయమైన పెట్టుబడి పెట్టింది. ఎస్ హెచ్ జి ల నాణ్యతా అంచనా, సమాఖ్యల సామర్థ్యవృద్ధి, ఆర్థిక సమావేశం , జీవనోపాధులపై ఆలోచనా నాయకత్వం-ఏ అంశమైనా, ఏపిమాస్ ఎప్పుడూ ఇతర సంస్థలను బలపరిచే సంస్థగా వ్యవహరించింది.

**రజతోత్సవ సందేశం!**

ఈ రజతోత్సవ సందర్భంలో, ఏపిమాస్ బృందానికి, గత , ప్రస్తుత బోర్డు సభ్యులకు, భాగస్వామ్య సంస్థలకు, అలాగే ఈ అనుబంధం ద్వారా బలపడ్డ అనేక సమాజ సంస్థలకు నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ సమిష్టి ప్రయాణంలో భాగస్వామిగా ఉండటం నాకు గౌరవంగా భావిస్తున్నాను. రాబోయే సంవత్సరాల్లో కూడా ఏపిమాస్ స్ఫూర్తినిచ్చే, ప్రశ్నించే, మార్గనిర్దేశం చేసే సంస్థగా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నాను. ■

## మార్పు సహసృష్టికర్తలుగా ఏపిమాస్‌ప్రాజెక్ట్ సిబ్బంది !

**మా** సహకారంలోని అత్యంత గొప్ప కార్యక్రమం ఏపిమాస్‌దే కావచ్చు: ఏపిమాస్ శిక్షకులు ఇప్పుడు కేవలం శిక్షణ అమలు చేసే వారిగా కాకుండా, మార్పుకు దారితీసే అభ్యాస వాతావరణాలను సహసృష్టి చేసే వారిగా ఎదిగారు. కంటెంట్ అందించే దశ నుండి ప్రక్రియ రూపకల్పన దశకు, “శిక్షకుడు” అనే గుర్తింపు నుండి “ఫెసిలిటేటర్” అనే స్వరూపానికి, విడివిడిగా జరిగే కార్యక్రమాల నుండి వ్యవస్థాత్మక అభ్యాస నిర్మాణాల దిశగా జరిగిన ఈ పరిణామమే మా సహకారపు నిజమైన వారసత్వం.ఏపిమాస్ ఎదుగుతున్న కొద్దీ, కార్యక్రమాలు మరింత నాణ్యంగా, అభ్యాసం అత్యుత్తమంగా కొనసాగించాలనే బలమైన ఆకాంక్ష ఉండేది.ఏపిమాస్ అభివృద్ధి అంతర్గత , బాహ్య సమన్వయంపై ఆధారపడి ఉంది.



డేవిడ్ ఫ్లెచర్ , డెబ్బీ క్యాసిల్,
పీపుల్ డెవలప్‌మెంట్, కెనడా

2015 నుండి 2023 వరకు, పీపుల్ డెవలప్‌మెంట్ , ఏపిమాస్ కలిసి శిక్షణ వ్యవస్థను బలోపేతం చేయడం, భాగస్వామ్య పద్ధతులను మరింత క్రియాశీలం చేయడం, ఆత్మపరిశీలనతో కూడిన శిక్షణా సంస్కృతిని నిర్మించడం కోసం పనిచేశాయి. ఈ కార్యక్రమం నాణ్యత, నిరంతర అభ్యాసం, స్వావలంబన పట్ల ఏపిమాస్ నిబద్ధతను స్పష్టంగా ప్రతిబింబించింది. ■

**సహృదయత లేకపోవడాన్ని మించిన గుండెజబ్బు మరొకటి లేదు**

# స్వయం నియంత్రణ సూత్రధారి ఏపిమాస్ !

భారతదేశంలోని స్వయం సహాయ సంఘాల (ఎస్ హెచ్ జిల) ఉద్యమ వికాసానికి, సహకార సమాఖ్యల బలోపేతానికి అంకితమైన తన 25 ఏళ్ల విజయ ప్రస్థానాన్ని ఏపిమాస్ ఘనంగా జరుపుకుంటోంది. ఈ పావు శతాబ్ద కాలంలో, ఏపిమాస్ ఒక వినూత్న పౌర సమాజ సంస్థగా ప్రారంభమై, నేడు స్వయం సహాయ సంఘాలు, వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్ పి ఓలు) , వాటి సమాఖ్యలు, సహకార స్వయం నియంత్రణ వ్యవస్థలపై (ఎస్ ఓ సి) జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నైపుణ్య కేంద్రంగా ఎదిగింది.



ఆండ్రూ కాప్స్, కోర్బీనియన్
డి జి ఆర్ వి ప్రతినిధులు

జర్మనీలోని సహకార రంగ అగ్రసంస్థ అయిన డి జి ఆర్ వి దాదాపు 20 సంవత్సరాలుగా ఏపిమాస్ భాగస్వామిగా పనిచేస్తోంది. ఈ సందర్భంగా , ఏపిమాస్ ప్రత్యేకతను డి జి ఆర్ వి గుర్తు చేసుకుంటోంది.

ఎస్ ఓ సి లేదా స్వయం నియంత్రణ విధానం ఎస్ హెచ్ జి ఉద్యమ స్థిరత్వానికి ఏపిమాస్ అందించిన అత్యంత ప్రాముఖ్యమైన కృషిలో ఒకటి. జర్మన్ సహకార వ్యవస్థల మాదిరిగా పారదర్శకత, ఆర్థిక క్రమశిక్షణ, సుపరిపాలనను బలోపేతంచేసే ఈ విధానాన్ని ఎస్ హెచ్ జి వ్యవస్థలకు అనుగుణంగా మార్చడం ఒక వినూత్న ప్రయత్నం.

రజతోత్సవ సందేశం!

ఏపిమాస్ , డి జి ఆర్ వి భాగస్వామ్యం కేవలం సాంకేతిక సహాయానికి పరిమితం కాలేదు. సంయుక్త అధ్యయనాలు, విధాన పత్రాలు, మూల్యాంకనాలు జాతీయ చర్చలను ప్రభావితం చేశాయి. జర్మన్ సహకార సంస్థల పర్యటనలు భారతీయ కార్యకర్తలకు సహకార స్వయం నియంత్రణను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించాయి.

విశ్వాసం, పరస్పర గౌరవం, నిబద్ధత, సహకార విలువలపై ఆధారపడిన ఈ భాగస్వామ్యం, దీర్ఘకాలిక అంతర్జాతీయ సహకారం ఎంత గొప్ప ఫలితాలు ఇవ్వగలదో నిరూపించింది. ■

## దీర్ఘకాలిక వ్యూహాత్మకంగా స్వయం నియంత్రణ !



డాక్టర్ సలోమా
సహకార రంగ నిపుణుడు

ఏపిమాస్ , డీజీఆర్వీ మధ్య ప్రత్యక్ష సహకారం 2006 నవంబరులో ప్రారంభమైంది. భారతీయ విధాన ప్రతినిధి బృందం జర్మనీలోని డీజీఆర్వీ అంతర్జాతీయ సంబంధాల విభాగాన్ని సందర్శించింది. ఆ బృందానికి ఏపిమాస్ సీఈఓ శ్రీ సి.ఎస్. రెడ్డి నాయకత్వం వహించారు. 150 సంవత్సరాలకు పైగా స్వయం నియంత్రణ వఅనుభవం కలిగిన జర్మన్ సహకార నమూనాను అధ్యయనం చేయడం ఈ సందర్శన లక్ష్యం. ఈ పర్యటన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఎస్ హెచ్ జి–ఎస్ ఓ సి పైలట్ ప్రాజెక్టును సంయుక్తంగా రూపకల్పనచేసి అమలు చేయడానికి డీజీఆర్వీ, ఏపిమాస్ అంగీకరించాయి. మొదటి నుంచే ఈ భాగస్వామ్యం దీర్ఘకాలిక వ్యూహాత్మక సహకారంగా రూపుదిద్దుకుంది. శ్రీ సి.ఎస్. రెడ్డి , ఏపిమాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి రామలక్ష్మి ఈ ప్రక్రియకు విశేష సహకారం అందించారు. 2007 ఏప్రిల్‌లో జర్మనీ ఆర్థిక సహకార ,అభివృద్ధి మంత్రిత్వ శాఖ మద్దతుతో ఎస్ ఓ సి ప్రాజెక్టుకు అధికారిక రూపం లభించింది. ఈ పైలట్ ప్రాజెక్టు అప్పటి నిజామాబాద్ జిల్లా (ప్రస్తుతం కామారెడ్డి జిల్లా)లోని కామారెడ్డి క్లస్టర్‌లో ప్రారంభమైంది. ఈ ప్రాజెక్టులో 5 మండల స్థాయి ఎస్ హెచ్ జి సమాఖ్యలు, 193 గ్రామ సమాఖ్యలు, సుమారు 5,000 ఎస్ హెచ్ జిలు భాగస్వామ్యమయ్యాయి. ఎన్ ఆర్ ఎల్ ఎం, నాబార్డ్‌వంటి వేదికల ద్వారా ఎస్ ఓ సి ని ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చింది. ■

**తీరికలేదనుకుంటే పెరిగేది సోమరితనం, తీరిక చేసుకుంటే వచ్చేది పనితనం**

# సి ఎస్ రెడ్డి వ్యక్తిత్వమే ఏపిమాస్ మూలబలం!

రజితోత్సవ సందేశం!

ఏపిమాస్ విజయవంతంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. గ్రామస్థాయి ప్రభుత్వ వ్యవస్థకు సామర్థ్యాన్ని పెంపొందించడం, మహిళా ఎస్ హెచ్ జి లను బలోపేతం చేయడం, వారిని సాధికారత వైపు నడిపించడం ఏపిమాస్ తన ప్రధాన లక్ష్యాలుగా చేసుకుంది.



డాక్టర్ వై వి మల్లారెడ్డి
డైరెక్టర్-ఏఎఫ్ ఇ సి

ఆవిర్భావం జరిగిన తొలి దశ నుంచే ఏపిమాస్‌ను, సి.ఎస్. రెడ్డిని తెలుసుకునే అదృష్టం నాకు లభించింది. ఈ చారిత్రాత్మక పరివర్తనను విజయవంతంగా క్షేత్ర స్థాయిలో అమలు చేయగల నాయకుడు సి. ఎస్. రెడ్డే అని అనిపించింది. కేర్ ఇంటర్నేషనల్ లో పొందిన అనుభవం, జాతీయ-అంతర్జాతీయ పరిచయాలు, అభివృద్ధిపట్ల ఉన్న సానుకూల దృక్పథం, అదనంగా ప్రభుత్వ ఉన్నతాధికారులతో వున్న వ్యక్తిగత సంబంధాలు ,ఆయనకు లభించిన గౌరవం యివన్నీ ఏపిమాస్‌కు గొప్ప బలం అయ్యాయి.

సి.ఎస్. రెడ్డి వ్యక్తిత్వం, ఏపిమాస్ నేపథ్యం కారణంగా ఈ సంస్థ చాలా సంప్రదాయ ఎన్ జి ఓల కంటే భిన్నంగా నిలుస్తుంది. 1980-90లలో ఏర్పడిన అనేక ఎన్ జి ఓలు మార్క్సిజం, గాంధేయం, సర్వోదయం, విముక్తి సిద్ధాంతం, అంబేద్కర్ భావజాలంవంటి సిద్ధాంత ప్రభావాలతో ఏర్పడ్డాయి. కాని, ఏపిమాస్ అలాంటి 'సిద్ధాంత భారం' తలకెత్తుకోకుండా, నేరుగా ప్రజల సమస్యలను పరిష్కరించే 'నికార్సయిన' 'ఆచరణాత్మక' ఎన్ జి ఓగా ఎదిగింది. ఇది ప్రధానంగా సి. ఎస్. రెడ్డి దృక్పథం వల్లే సాధ్యమైంది. ఆర్ డి టి వ్యవస్థాపకులు ఫాదర్ ఫెర్రర్ కూడా ఇలాంటి ఆలోచనను విశ్వసించేవారు. 'ఎన్ జి ఓలు పేదలకు సేవచేయాలి; ఏ సిద్ధాంతానికీ సేవకులుగా మారకూడదు' అని ఆయన అనేవారు.

## మైక్రో ఫైనాన్స్ వ్యవస్థ లోపాలకు చికిత్సచేసిన ఏపిమాస్

2000ల ప్రారంభంలో ఆంధ్రప్రదేశ్‌లో మైక్రోఫైనాన్స్ కార్యకలాపాలు వేగంగా విస్తరిస్తున్న సమయంలో, ఏపిమాస్ స్థాపక సి ఇ ఓ సి.ఎస్. రెడ్డి అధిక అప్పులు, బహుళ రుణభారం వంటి సమస్యలను ముందుగానే గుర్తించారు. స్వయం నియంత్రణ సంస్థల భావన విస్తృతంగా చర్చకు రాకముందే, రంగానికి ఒక ప్రవర్తనా నియమావళి అవసరమని ఏపిమాస్ సూచించింది.



జీజి మమ్మెన్
సి ఇ ఓ సా-ధన్

దీని ఫలితంగా, 2007లో సా-ధన్ మైక్రోఫైనాన్స్ రంగానికి ఒక ప్రవర్తనా నియమావళిని రూపొందించింది. దీనిని రూపుదిద్దడంలో సి.ఎస్. రెడ్డి కీలక పాత్ర పోషించారు. ఆ సమయంలో సా-ధన్ ప్రమాణాల సబ్‌కమిటీలో ఏపిమాస్ సభ్యత్వం కలిగి ఉండి, వినియోగదారుల రక్షణ, నైతిక ప్రమాణాల బలోపేతానికి ముఖ్యమైన సూచనలు చేసింది. సా-ధన్‌కు సన్నిహిత మిత్ర సంస్థగా, ఏపిమాస్ సాధించిన విజయాలపై మేము గర్విస్తున్నాము. భవిష్యత్తులో కూడా ఈ సంస్థ మరింత విస్తృతంగా సేవలు అందిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నాము. సి.ఎస్. రెడ్డి గారికి , మొత్తం ఏపిమాస్ బృందానికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు. రాబోయే 25 సంవత్సరాల్లో మరింత ఉత్సాహభరితమైన కార్యక్రమాలు కొనసాగుతాయని నమ్మకం. ■

# సమాజ సాధికారతకు 25 వసంతాల అంకిత యాత్ర !

వ్యక్తిగతంగా, ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ అలయెన్స్ ఆసియా, పసిఫిక్ (ఐ సి ఏ –ఏపి) తరఫున సమాజ సేవలో విశిష్టమైన ఇరవై ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఏపిమాస్ సంస్థకు హృదయపూర్వక అభినందనలు తెలియజేయడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. ఈ వేడుక ఒక సంస్థ సాధించిన మైలురాయి మాత్రమే కాదు; మార్పు, సహనశక్తి, విలువల ఆధారిత అభివృద్ధి ప్రయాణానికి ప్రతీక కూడా!



బాలు అయ్యర్
ఐ సి ఏ–ఏపి

అభివృద్ధి నమూనాలు నిరంతరం మారుతున్న ఈ కాలంలో కూడా, ప్రజాకేంద్రీకృత విధానాలకు కట్టుబడి ఉండటం ద్వారా ఏపిమాస్ ప్రత్యేక గుర్తింపును పొందగలిగింది. గ్రామీణస్థాయి సంస్థల పరిపాలనను బలోపేతం చేయడం, బాధ్యతాయుత వ్యవస్థలను ప్రోత్సహించడం, సామర్థ్యాలను పెంపొందించడం వంటి అంశాలపై దాని నిరంతర దృష్టి, ఆంధ్రప్రదేశ్ , తెలంగాణలోనే కాకుండా భారతదేశవ్యాప్తంగా ,అంతర్జాతీయ స్థాయిలో కూడా దానికి గౌరవప్రదమైన స్థానాన్ని కల్పించింది.

సభ్యులకే తమ అభివృద్ధి మార్గాలను నిర్ణయించే అధికారం, నైపుణ్యం ఉంటే సంస్థలు ఎలా అభివృద్ధి చెందగలవో అది నిరూపించింది.

ఇందులో ప్రధాన పాత్ర సి ఎస్ రెడ్డి గారిదే. సహకార, సామాజికాభివృద్ధి రంగాలకు ఆయన చేసిన సేవలు విశేషమైనవి. ఐ సి ఏ –ఏపి లో మేము ఆయన ఆలోచనా నాయకత్వాన్ని, ప్రజా కేంద్రిత అభివృద్ధిపట్ల ఆయన అంకిత భావాన్ని ఎంతో విలువైనదిగా భావిస్తున్నాము.

రజతోత్సవ సందేశం!

సమాజ సాధికారతలో ఇరవై ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఈ సందర్భంగా, ఏపిమాస్ మరింత ఆశాజనక భవిష్యత్తు వైపు అడుగులు వేస్తోంది. నిజాయితీ, సమగ్రత, స్వయం ప్రతిపత్తి, పారదర్శకత, సామూహిక చర్య – ఇవే దాని ప్రయాణాన్ని నడిపించిన విలువలు.

భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ మరింత న్యాయసమ్మతమైన, స్థిరమైన, ప్రజాకేంద్రీకృత అభివృద్ధి వ్యవస్థ నిర్మాణంలో ఏపిమాస్ తన వారసత్వాన్ని కొనసాగిస్తుందని నాకు పూర్తి నమ్మకం ఉంది. ■

## స్వార్థ రహితం ... విస్తృత ప్రయోజనాలకే ప్రాధాన్యం!

రెండు దశాబ్దాలకుపైగా ఎస్ హెచ్ జి లను బలోపేతంచేసి స్వయం సమర్థ సంస్థలుగా తీర్చిదిద్దడంలో ఏపిమాస్ ముందంజలో నిలిచింది. ఎస్ హెచ్ జి–బ్యాంక్ లింకేజ్ కార్యక్రమం ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రధాన ప్రవాహంగా మారిన తరువాత, ఏపిమాస్ వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్ పి ఓల) సామర్థ్యవృద్ధి వైపు అడుగులువేసి రైతులకు కూడా సేవలందించడం ప్రారంభించింది. ఏపిమాస్ ఎల్లప్పుడూ రంగానికి నాయకత్వం వహిస్తూ, కేవలం తమ సంస్థ ప్రయోజనాలకే పరిమితం కాకుండా మొత్తం రంగ ప్రయోజనాల కోసం ముందంజలో నిలిచింది. ప్రతి సంవత్సరం ఎస్ హెచ్ జి, ఎస్ హెచ్ జి సమాఖ్యల వార్షిక వర్క్‌షాప్ నిర్వహించడం, ఉత్తమ ఎస్ హెచ్ జి సమాఖ్య అవార్డులను ప్రవేశపెట్టడం, ఎఫ్ పి ఓల ఆర్థిక సహాయంపై జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించడం, ఎఫ్ పి ఓ పర్యావరణ వ్యవస్థ సమస్యలను ముందుకు తీసుకురావడం – ఇవన్నీ ఈ ఆలోచనకు సాక్ష్యాలుగా నిలుస్తాయి. ■



ఇమ్మాన్యుయేల్ ముర్రే

కోపం నిన్ను చిన్నబుచ్చుతుంది, క్షమ నీ వ్యక్తిత్వ స్థాయిని పెంచుతుంది

# సుస్థిర ప్రారంభం...25 ఏళ్లుగా కొనసాగుతున్న విలువలు!

-సుఖ్వీందర్ సింగ్ అరోరా

ఏపిమాస్ 25వ వార్షికోత్సవ వేడుకలలో భాగస్వామి కావాలని నన్ను ఆహ్వానించడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. ఈ మహత్తర సందర్భంలో ఏపిమాస్ వ్యవస్థాపకులు, ప్రోత్సాహకులు, నిధుల భాగస్వాములు, ప్రత్యేకించి డాక్టర్ పి. కోటయ్య , విజయ్ మహాజన్, నందితా రే, ఎస్ పి టకర్, కె రాజు, సి ఎస్ రెడ్డి గార్లను, డిఎఫ్ ఐ డి, కేర్, ఏపిమాస్ బృందాలను, భాగస్వాములను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.



డి ఎఫ్ ఐ డి ఇండియా బృంద సభ్యుడిగా, ఏపిమాస్ అభివృద్ధి ప్రయాణంలో జరిగిన చర్చలు, సందేహాలు, ఆలోచనలను దగ్గరగా గమనించే అవకాశం నాకు లభించింది. ఈరోజు నేను తాతయ్యగా మారిన తరువాత మరింత స్పష్టంగా గ్రహిస్తున్నాను - ఒక పిల్లవాడిని పెంచడానికి మొత్తం గ్రామం అవసరం! అదే విధంగా, ప్రారంభ ఉత్సాహాన్ని, నిధులను దాటి 25 సంవత్సరాల తరువాత కూడా విలువను సృష్టించే సంస్థగా కొనసాగించడం మరింత కష్టం.

1998-2001 మధ్య కాలంలో పురోగతి మందగించినట్లు అనిపించిన సందర్భాలు ఉన్నప్పటికీ, ప్రారంభ దశలో జరిగిన చర్చలు, విశ్లేషణలు, ఆలోచనలు ఏపిమాస్ కు బలమైన పునాదులు వేశాయని వెనక్కి చూసినప్పుడు స్పష్టమవుతోంది.

**రజతోత్సవ సందేశం!**

25వ వార్షికోత్సవ సందర్భంగా బోర్డు సభ్యులకు, ఏపిమాస్ బృందానికి మరియు ఇతర భాగస్వామ్యులకు హృదయపూర్వక అభినందనలు. ఏపిమాస్ వివిధ నిధుల భాగస్వాముల విశ్వాసాన్ని గెలుచుకొని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మారుతూ, ఆంధ్రప్రదేశ్‌లోనే కాక దేశవ్యాప్తంగా ప్రజాహిత కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసిన సంస్థగా ఎదిగింది. ■

## శ్రీ సి ఎస్ బృందం ప్రత్యేక గుర్తింపునకు అర్హులు!



వి రుక్మిణీ రావు
గ్రామ్య కార్యదర్శి

గత ఇరవై ఐదు సంవత్సరాల ఏపిమాస్ ప్రయాణాన్ని పరిశీలిస్తే - అది ఐదు కంటే ఎక్కువ రాష్ట్రాల్లో 35,000కు పైగా ఎస్ హెచ్ జిలతో పనిచేసింది. నైపుణ్యాల మ్యాపింగ్ చేసి, స్వావలంబన సామర్థ్యాన్ని అంచనా వేసింది. సహకార సంఘాల నిర్వహణలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి 'స్వయం నియంత్రణ' వంటి అంతర్జాతీయంగా పరీక్షించబడిన భావనలను పరిచయం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో, తెలంగాణలో మహిళా రైతులను ఎఫ్ పి ఓలతో భాగస్వామ్యం చేయడానికి 'జెండరింగ్' వంటి ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టింది. మైక్రోఫైనాన్స్, ఎఫ్ పి ఓల బలోపేతం , ఇతర అభివృద్ధి రంగాలపై విధాన మార్పులకు నేరుగా దోహదపడిన పథప్రదర్శక పరిశోధనలకు శ్రీ సి. ఎస్. రెడ్డి గారు , ఆయన బృందం ప్రత్యేక గుర్తింపునకు అర్హులు. సమకాలీనతను నిలుపుకోవడం, ప్రజాస్వామ్య పద్ధతులను బలోపేతం చేయడం, అట్టడుగు వర్గాల జీవితాలను మెరుగుపరచడం పట్ల వారి కట్టుబాటు ప్రశంసనీయం. పేదరికపు సంకెళ్లను తెంచుకుని గౌరవప్రదమైన జీవితం గడపడానికి మహిళలు , అత్యంత అట్టడుగు వర్గాలకు మద్దతు ఇస్తూ ఏపిమాస్ మరెన్నో సంవత్సరాలు వినూత్న కార్యక్రమాలతో ముందుకు సాగాలని నేను ఆకాంక్షిస్తున్నాను. ■

వాదనలో ఎంతగా వేడి పెరిగితే అంతగా నిజం కనుమరుగవుతుంది

# ఇరవై ఐదు సంవత్సరాలుగా ప్రజలతో మమేకమైన ప్రయాణం!

ఏపిమాస్ ఇరవై ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకుంది. అభివృద్ధి రంగంలో చాలా అరుదుగా కనిపించే ఒక విశేషాన్ని అది నిర్మించింది. అదే ...కాలానుగుణ ధోరణుల వెనుక పరుగులు తీయకుండా, సమాజాలపై దృష్టి నిలిపి, దీర్ఘకాలిక సంస్థాగత సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం. ఏపిమాస్‌కు అభినందనలు.



పాపారావు చింతలపూడి
సోషల్ వెంచర్ పార్ట్నర్స్

ఇరవై ఐదు సంవత్సరాల తరువాత కూడా ఏపిమాస్ పని నేలమట్టానికి దగ్గరగానే ఉంది. సమాజాలతో కలిసి కొనసాగడం, వాటిని చుట్టుముట్టిన వ్యవస్థలను మెరుగుపరచడం, తక్షణ ప్రాజెక్టులను మించి ఆలోచించగల నాయకత్వాన్ని నిర్మించడం దాని అసలైన బలం.

రెండు దశాబ్దాల పాటు ఏపిమాస్ స్వయం సహాయ సంఘాల (ఎస్ హెచ్ జి) రంగంలో లోతైన అనుభవాన్ని సంపాదించింది. అయితే, ఇరవై సంవత్సరాల తరువాత, ఎస్ హెచ్ జి వ్యవస్థలో మారుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, తమ దృష్టిని పునఃపరిశీలిస్తూ సంస్థ తన ప్రయాణాన్ని కొత్త దిశగా మలిచింది. చిన్న రైతులను వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్ పి ఓల/ఎఫ్ పి సిల) ద్వారా బలోపేతం చేయడంపై దృష్టి పెట్టడం ఏపిమాస్ తీసుకున్న కీలక నిర్ణయం. అదే సమయంలో, 2021లో 'సోషల్ వెంచర్ పార్ట్నర్స్' ద్వారా ఏపిమాస్‌తో నా అనుబంధం ప్రారంభమైంది.

రజతోత్సవ సందేశం!

ఇప్పుడు ఏపిమాస్ తన మూడవ దశాబ్దంలో పది లక్షల జీవితాల సామాజిక, ఆర్థిక మార్పును లక్ష్యంగా పెట్టుకుంది. ఇది చిన్నమార్పు కాదు; ఇది ఒక సంస్థ తనను తాను పునర్నిర్మించుకోవడం! పది లక్షల జీవితాల మార్పు అనే లక్ష్యం మహత్తరమైనదే. కానీ అది ఇరవైఐదు సంవత్సరాలుగా సాగుతున్న సహనంతో కూడిన క్షేత్రస్థాయి పనిపై ఆధారపడినదే. అందుకే ఆ లక్ష్యం సాధ్యమే.

ఈ దృష్టిని సాకారం చేసే ప్రయాణంలో ఏపిమాస్‌కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ■

# సంక్షోభ సమయంలో సైతం చెక్కుచెదరని స్థైర్యం, ఆగని సాయం!

ఏపిమాస్‌తో నా ప్రయాణం ఉత్సాహభరితంగానూ, సవాళ్లతో నిండినదిగానూ సాగింది. త్వరగా మార్పులకు అనుగుణంగా మారడం, కొత్త బాధ్యతలను స్వీకరించడం నేర్చుకున్నాను. ప్రతి అనుభవం నా దృష్టిని విస్తరించింది; తాత్కాలిక ఉద్యోగిగా ప్రారంభమైన నా ప్రయాణం, 2020లో నా పదవీ విరమణ నాటికి డైరెక్టర్ – ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ హోదా వరకు ఎదిగింది. అనేక సంస్థల మాదిరిగానే, ఏపీఎంఏఎస్ కూడా అనిశ్చితి, ఆర్థిక ఒత్తిడి దశలను ఎదుర్కొంది. దాతల ప్రాధాన్యతలు మారడంతో కొందరు నిధుల మద్దతును నిలిపివేశారు. శిక్షణా కార్యక్రమాలు తగ్గడంతో ఆర్థిక ఒత్తిడి మరింత పెరిగింది. ఈ పరిస్థితులు ఆర్థిక విధానాల్లో కఠిన మార్పులను అవసరం చేశాయి. 2020లో కరోనా మహమ్మారి ఈ ఒత్తిడిని మరింత తీవ్రతరం చేసింది. ఆ సంక్షోభ సమయంలో ఏపిమాస్ నిజమైన బలం, విలువలు వెలుగులోకి వచ్చాయి. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో కూడా బృందాలు తమ కార్యాచరణ ప్రాంతాల్లో సమాజానికి సేవలను కొనసాగిస్తూ, అవసరమైన సహాయ, ఉపశమన చర్యలు చేపట్టాయి. ■



ఏ వి రాజన్

# శిఖరారోహణలో ఆరితేరి, రజితోత్సవ సంస్థగా తీర్చిదిద్ది!

–విపిన్ శర్మ

2025 అక్టోబర్‌లో, సి ఎస్ రెడ్డి అత్యంత క్లిష్టమైన నందాదేవిబేస్ క్యాంప్ ట్రెక్కింగ్ యాత్రకు బయలుదేరారు. వాతావరణం అనుకూలంగా లేకపోయినా, ఆయన వెనుకడుగు వేయలేదు. లక్ష్యానికి చాలా దగ్గర వరకూ చేరుకున్నారు. ఆ క్షణం – సహనశక్తి, పట్టుదల, అచంచలమైన సంకల్పానికి ప్రతీకగా నిలిచింది. గత 25 సంవత్సరాలుగా ఆయన సాగించిన ప్రయాణానికి అదే సరైన రూపం! అదే ప్రయాణం ఏపిమాస్ ను భారతదేశంలో జీవనోపాధుల ప్రోత్సాహంలో అత్యంత గౌరవనీయమైన సంస్థలలో ఒకటిగా తీర్చిదిద్దింది.

**రజితోత్సవ సందేశం!**

ఢిల్లీలో జరిగిన నా మొదటి సీనియర్ మేనేజ్‌మెంట్ టీమ్ సమావేశంలోనే సి ఎస్ రెడ్డిని కలిశాను. ఆయన వెంటనే అందరి దృష్టిని ఆకర్షించారు. పొడవైన ఆకృతి, స్పష్టమైన మాటతీరు, నిర్భయ స్వభావం, భిన్నంగా ఆలోచించే వ్యక్తిత్వం. ఏ కార్యాలయంలోనైనా ప్రవేశించి, మద్దతు సమీకరించి, ఫలితాలను సాధించే సామర్థ్యం ఆయన ప్రత్యేకత.

ఈరోజు, 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఏపిమాస్ అమలు, సామర్థ్యవృద్ధి, విధాన చర్చల సంగమ స్థలిగా నిలిచింది. దాని ప్రయాణం స్థిరమైన అభివృద్ధి, ఆలోచనాత్మక పరిణామం, అర్థవంతమైన ప్రభావానికి నిదర్శనం.

ఈ మొత్తం ప్రయాణం వెనుక నిలిచింది సి ఎస్ రెడ్డి అచంచల సంకల్పమే. సాహస నిర్ణయాలు తీసుకోవడం, సంస్థలను నిర్మించడం, క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనడం, ఇతరులను ప్రేరేపించడం – ఇవన్నీ ఏపిమాస్ విజయానికి మూలస్తంభాలు.

నందాదేవి బేస్ క్యాంప్ యాత్రలాగే, ఈ ప్రయాణం కూడా సులభం కాదు. కానీ ప్రతి అడుగు అర్థవంతమైనదే. సి ఎస్ రెడ్డి గురించి తెలిసిన వారెవరైనా ఒక విషయం మాత్రం కచ్చితంగా చెబుతారు – ఆయనకు శిఖరం ఎప్పుడూ చాలా దూరంలో ఉండదు! ■

## అభివృద్ధి రంగానికి పాఠాలను అందిస్తున్న ఆదర్శ సంస్థ !



అనిల్ కుమార్ ఎస్ జి
సి ఇ ఓ–సమున్నతి

ఏపిమాస్ తన 26వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న ఈ సమయంలో, సంస్థ చేస్తున్న పని అభివృద్ధి రంగానికి ఎంతో ముఖ్యమైన పాఠాలను అందిస్తోంది. ముఖ్యంగా సంస్థాగత స్థిరత్వాన్ని నిర్మించడం, భాగస్వామ్యాన్ని పెంపొందించడం, సమాజ అనుసంధానాన్ని మరింత గాఢంగా చేయడం వంటి అంశాల్లో ఇది ఆదర్శంగా నిలుస్తోంది. భారతదేశ అభివృద్ధి ప్రస్థానం గ్రామీణ స్థాయిలో ఓర్పుతో, నిరంతర కృషితో పనిచేసిన అనేక సంస్థల ద్వారా రూపుదిద్దుకుంది. వాటిలో ఏపిమాస్ ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తూ, గ్రామీణ సమాజాల్లో సమిష్టి చర్యలకు బలమైన పునాదులను నిర్మిస్తూ, స్థిరమైన సమగ్రాభివృద్ధిని ముందుకు తీసుకెళ్తోంది. రెండు దశాబ్దాలకు పైగా ఏపిమాస్ స్వయం సహాయక సంఘాలు, కమ్యూనిటీ సంస్థలు, వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థల బలోపేతానికి అంకితభావంతో పనిచేసింది. పాలన, సంస్థాగత నిర్మాణం, సమిష్టి చర్యలపై సంస్థ పెట్టిన దృష్టి, గ్రామీణ సమాజాలు సమర్థంగా సంఘటితమవడానికి, అవకాశాలను పొందడానికి, మార్కెట్లలో తమ భాగస్వామ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి దోహదపడింది. ఈ దృక్పథం, మేము 'సమున్నతి' లో విశ్వసించే 'బలమైన వ్యవస్థలు, పారదర్శక పాలన, సాధికార సభ్యత్వం' అనే మార్పు పునాదులకు అనుగుణంగా ఉంది. సంస్థ తదుపరి అధ్యాయం అపారమైన అవకాశాలను కలిగి ఉంది. గ్రామీణ సమాజాల సాధికారత పట్ల దాని నాయకత్వం, దూరదృష్టి, నిరంతర నిబద్ధత నుండి మొత్తం అభివృద్ధి వ్యవస్థ మరింత ప్రయోజనం పొందనుంది. ■

చూసే మనసులో అందం వుంటే అంతటా, అన్నిటా అందం వున్నట్టే

# పేదప్రజలకు పెనుమార్పు సృష్టికర్తలుగా మార్గదర్శనం!

**అ**ట్టడుగు వర్గాల ప్రజలు కేవలం సహాయం పొందేవారు మాత్రమే కాదు, మార్పును సృష్టించే శక్తివంతమైన ప్రతినిధులనే నమ్మకానికి ఏపిమాస్ ప్రయాణం సాక్ష్యం. మారుమూల గ్రామంలోని ఒక నిశ్శబ్ద స్వయం సహాయక సంఘ సమావేశం నుంచి మార్కెట్ ధరలపై చర్చించే రైతు ఉత్పత్తిదారుల సంస్థల సమిష్టి శక్తివరకు, ఏపిమాస్ ప్రభావం వేలాది సమాజాలలో ప్రతిధ్వనిస్తోంది." ప్రభావం వేలాది సమాజాలలో ప్రతిధ్వనిస్తోంది.



భీమ సుబ్రహ్మణ్యం
అధ్యక్షుడు, ఐ సి బి ఏ

గత 25 సంవత్సరాలలో ఏపిమాస్ భౌగోళికంగా, సంస్థాగతంగా విస్తరించింది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన ఈ సంస్థ ప్రస్తుతం తెలంగాణ, బీహార్ రాష్ట్రాల్లో ప్రభావాన్ని చూపుతుండగా, ఎథియోపియా, జర్మనీ, వియత్నాం వంటి దేశాలలో కూడా తన సేవలను విస్తరించింది. అయినప్పటికీ, సమాజ కేంద్రిత అభివృద్ధి అనే తన మూల తత్వానికి ఇది ఎప్పటికీ కట్టుబడి ఉంది.

ఏపిమాస్ గతాన్ని చూసుకుంటూనే భవిష్యత్తును నిర్మిస్తోంది. "విజన్ 2030" ద్వారా ఇది వ్యవస్థాత్మక మార్పుకు ఒక స్పష్టమైన దిశను ప్రతిపాదిస్తోంది. ఈ దశాబ్దం ముగిసే నాటికి, 10 లక్షల కుటుంబాల జీవితాలపై సానుకూల ప్రభావం చూపే ప్రపంచ స్థాయి వనరుల సంస్థగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకుంది.

రజితోత్సవ సందేశం!

సవాళ్లు, విజయాలతో నిండిన ఈ 25 ఏళ్ల విశిష్ట ప్రయాణాన్ని ఏపిమాస్ గర్వంగా జరుపుకోవచ్చు. అయితే, దీని అసలు గొప్పతనం గత విజయాలలో మాత్రమే కాదు; భవిష్యత్తులో వేలాది కుటుంబాలకు సాధికారత, గౌరవం, స్థిరమైన అభివృద్ధిని అందించే శక్తిలో ఉంది. ఏపిమాస్ ఈరోజు మరింత బలంగా, స్వయం సమృద్ధిగా, భవిష్యత్తును నాయకత్వం వహించేందుకు సిద్ధంగా నిలిచింది. ■

## వృత్తి నిపుణుల సజీవ నిత్యచైతన్య కర్మాగారం!

– హర్ష్ జైట్లీ

**2**5 విజయవంతమైన సంవత్సరాలను పూర్తి చేసుకున్న ఏపిమాస్‌కు, దాని బృందానికి వాణి కార్యదర్శిత్వం, గవర్నింగ్ బోర్డు, సభ్యుల తరపున నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. వాణి సంస్థకు ఏపిమాస్ ఒక గౌరవనీయ సభ్యసంస్థగా ఉండి, వాణి వ్యూహాత్మక దిశా నిర్దేశంలో ఎల్లప్పుడూ నిర్మాణాత్మక మార్గదర్శకత్వాన్ని అందించింది. జీవనోపాధి, ఎఫ్‌పీఓలు , ఎస్‌హెచ్‌జీ సమాఖ్యల అభివృద్ధికి తోడ్పడే నైపుణ్యవంతులైన వృత్తి నిపుణులను, పారాప్రొఫెషనల్స్‌ను తీర్చిదిద్దడంలో ఏపిమాస్ విశేష కృషి చేసింది. ఈ రంగాల్లో మాస్టర్ ట్రైనర్ల బలమైన వనరుల సమూహాన్ని కూడా సంస్థ అభివృద్ధి చేసింది. జ్ఞాన సృష్టిలో కూడా ఏపిమాస్ గణనీయమైన పాత్ర పోషించింది. 88 పరిశోధనా అధ్యయనాలు, 75 అంశాధారిత ప్రచురణలను వెలువరించింది. ఈ రచనలు రంగంలోని విధాన రూపకల్పనకు ఉపయోగపడినవి. శ్రీ సి.ఎస్. రెడ్డి నాయకత్వంలో, స్వచ్ఛంద రంగంలో స్వతంత్రత , స్వయంప్రతిపత్తిని సామర్థ్యవృద్ధి ద్వారా , సాధికారత ద్వారా ఏపిమాస్ నిరంతరం ప్రోత్సహించింది. కార్యక్రమాల సంయుక్త నిర్వహణ ద్వారా విస్తృత స్థాయిలో సంస్థ అందించిన విలువైన సహకారాన్ని వాణి ప్రశంసిస్తూ, ఏపిమాస్, దాని బృందం భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తోంది. ■

ఒకరి మూఢనమ్మకం మరొకరి అపనమ్మకానికి జీవం పోస్తుంది

# ప్రభుత్వాలకు, సామాజిక సంస్థలకు ప్రేరణ శక్తి ఏపిమాస్ !

ప్రభుత్వాలు , ఇతర సామాజిక సంస్థలు కూడా ఏపిమాస్ విధానాలను అనుసరించడం దాని కార్యక్రమాల ప్రాముఖ్యతకు నిదర్శనం. సమాజ అవసరాలను గుర్తించి, ప్రభుత్వ , మార్కెట్ పరిమితులను అధిగమించే జోక్యాలను రూపొందించడంలో ఏపిమాస్ ఎంత ప్రభావవంతంగా ఉండగలదో ఇది నిదర్శనం.ఏపిమాస్ స్వతంత్ర సంస్థాగత నిర్మాణం కూడా దీని విజయానికి ముఖ్య కారణం. దాతలు, ప్రభుత్వ యంత్రాంగం, మార్కెట్ ప్రభావాల మధ్య సమతుల్యతను పాటిస్తూ, సముదాయ కేంద్రిత దృక్పథాన్ని అది కొనసాగించింది. ఇంకా ముఖ్యంగా, ఏపిమాస్ నాయకత్వం గత పావు శతాబ్దంగా తమ నిబద్ధతను, దూరదృష్టిని కొనసాగించడం వల్లే ఈ సంస్థ 25 సంవత్సరాలకు కూడా తన ప్రాధాన్యతను కోల్పోకుండా, యింకా పెంచుకుంటూ వస్తున్నది.



హెచ్ ఎస్ శైలేంద్ర
ప్రొఫెసర్

ఏపిమాస్ ఇప్పటివరకు సమర్థవంతమైన ప్రయాణం సాగించినప్పటికీ, రాబోయే కాలంలో మరింత వ్యూహాత్మకంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది.

రజితోత్సవ సందేశం!

స్వయం సహాయం, స్వావలంబన వంటి విలువలు ముఖ్యమైనవే అయినప్పటికీ, అవి మాత్రమే పేదరిక నిర్మూలనకు సరిపోవు. మహిళల ఆధ్వర్యంలోని సమాఖ్యలు మరింత బలపడేందుకు జీవనోపాధి అవకాశాలు, వనరులు, సామర్థ్యాలు పెరగాలి.

ఎస్ హెచ్ జి సమాఖ్యల్లో తదుపరితరం నాయకత్వాన్ని పెంపొందించడం, పాలనను మెరుగుపరచడం అవసరం. ఆర్థిక కార్యకలాపాలకు తోడు మహిళల హక్కులు, చర్చా సామర్థ్యం, సామాజిక స్థానం బలోపేతం కావాలి.

ఏపిమాస్ నాయకత్వం తన అనుభవంతో ఈ కొత్త దిశల్లో ముందుకు వెళ్లగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. అదే సమయంలో తదుపరితరం నాయకత్వాన్ని కూడా సంస్థలో పెంపొందించుకోవాలి. ■

## ఏపిమాస్ తనను తాను పునర్నిర్వచించుకోవాలి



మధుమూర్తి
ఏపిమాస్ మాజీ ఇ డి

మొదటగా, ఏపిమాస్ రజితోత్సవం సందర్భంగా నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను! ఒక సంస్థ 25 సంవత్సరాల పాటు నిరంతరం చురుకుగా, చైతన్యవంతంగా, ప్రభావవంతంగా కొనసాగడం సాధారణ విషయం కాదు. ఇది కేవలం ఏపిమాస్‌కే కాకుండా, అభివృద్ధిరంగ స్వయం నియంత్రణ ఉద్యమానికి ,దేశంలోని స్వావలంబన కమ్యూనిటీ సంస్థల ఉద్యమానికి కూడా ఒక మైలురాయి వంటి ఘట్టం. ఈ ప్రయాణంలో భాగస్వామి కావడం, ఈ సందర్భంగా నా అభిప్రాయాలను పంచుకునే అవకాశం రావడం నాకు గర్వకారణం.ఎస్‌హెచ్‌జీలు తమ జీవన చక్రంలో కొత్త దశకు చేరుకున్నాయి. వాటి సమాఖ్యలు కూడా ప్రస్తుత పరిమిత సేవలను దాటి ముందుకు వెళ్లే దశలో ఉన్నాయి. సభ్యుల జీవన నాణ్యతను మెరుగుపరచడం, సంపద సృష్టి దిశగా విజన్- 2030 సాధనకు అవసరమైన సేవలను ఏపీఎంఏఎస్ అందించవచ్చు. ఈ నేపథ్యంలో ఏపిమాస్ కూడా తనను తాను పునర్నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది. స్వావలంబన కమ్యూనిటీ సంస్థల నిర్మాణం, ముఖ్యంగా మహిళలు సహా అట్టడుగు వర్గాల జీవనోపాధి అభివృద్ధి లక్ష్య సాధనలో ఏపీఎంఏఎస్ మరింత గొప్ప సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ■

# సంస్థాగత ఆవిష్కరణలలో అగ్రగామి ఏపిమాస్ !

ఈ శతాబ్దపు తొలి దశకానికే, దేశవ్యాప్తంగా మహిళా సంఘాల సంస్థాగత అభివృద్ధిలో అగ్రగామి వనరుల సంస్థగా ఏపిమాస్ తన స్థానాన్ని స్థిరపరచుకుంది. తరువాత ఈ ప్రయాణం రైతులు , అసంఘటిత ఆర్థిక వర్గాల జీవనోపాధి అభివృద్ధి దిశగా, ఉత్పత్తిదారుల సమూహాల ద్వారా మరింత విస్తరించింది.


అజయ్ టాంకా
అభివృద్ధి సలహాదారు

ఫెడరేషన్ల కోసం రూపొందించిన గ్రేడ్స్ మూల్యాంకన విధానం, స్వయం నియంత్రణ సంస్థల రూపకల్పన, ఏపిమాస్ చేపట్టిన సంస్థాగత ఆవిష్కరణలకు మంచి ఉదాహరణలు. ప్రోత్సాహం, శిక్షణ , విస్తరణ కార్యక్రమాలకు మించి, ఇవి సంస్థాగత బలోపేతానికి దోహదపడ్డాయి.

ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ రాష్ట్రాల నుంచి కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ (సి ఆర్ పిలు) అనే సామాజిక మూలధనానికి ఆధారమైన నాయకులను ఎంపిక చేసి, వారికి శిక్షణనిచ్చి, బీహార్ , రాజస్థాన్ వంటి రాష్ట్రాలలో ఎస్ హెచ్ జి ఉద్యమ విస్తరణకు వారిని సిద్ధం చేయడంలో ఏపిమాస్ , ఎస్ ఆర్ ఎల్ ఎం లు కీలక పాత్ర పోషించాయి.

మహిళా పారిశ్రామికవేత్తల 'గ్రాడ్యుయేషన్' ఆశయాలకు ప్రోత్సాహం లభిస్తుండగా, మరోవైపు నాబార్డ్ తదితర సంస్థల మద్దతుతో ఉత్పత్తిదారుల సమూహాలు పెద్ద ఎత్తున ఏర్పడుతున్నాయి.

రజతోత్సవ సందేశం!

మరోసారి,వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థలను (ఎఫ్ పి ఓలను) ప్రోత్సహించడంలో ఏపిమాస్ ముందంజలో నిలిచింది. జ్ఞానం, శిక్షణ సామగ్రి , ప్రాయోగిక నమూనాల విషయంలో ఇది అనమాన వనరుల సంస్థగా నిలిచింది.

సి.ఎస్. రెడ్డి గారితో నా అనుబంధం క్యాషే ప్రాజెక్టు కాలం నుంచి ఇప్పటివరకు కొనసాగుతోంది. ఆయన ద్వారా ఏపిమాస్ తమ పరిశోధన , శిక్షణ కార్యక్రమాల్లో నన్ను భాగస్వామిని చేసింది. ఎల్. బి. ప్రకాష్, డా. కె. రాజారెడ్డి, జి. భాస్కరరావు ఎస్. రామలక్ష్మి వంటి ఏపిమాస్ సహచరులతో కలిసి వివిధ కార్యక్రమాలలో పనిచేయడం నాకు ఆనందాన్ని ఇచ్చింది. ■

## సంక్షోభ సమయంలో సైతం చెక్కుచెదరని స్థైర్యం, ఆగని సాయం!

ఏపిమాస్‌తో నా ప్రయాణం ఉత్సాహభరితంగానూ, సవాళ్లతో నిండినదిగానూ సాగింది. త్వరగా మార్పులకు అనుగుణంగా మారడం, కొత్త బాధ్యతలను స్వీకరించడం నేర్చుకున్నాను. తాత్కాలిక ఉద్యోగిగా ప్రారంభమైన నా ప్రయాణం, ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ హోదా వరకు ఎదిగింది. అనిశ్చితి, ఆర్థిక ఒత్తిడి దశలను ఎదుర్కొంది. దాతల మద్దతును నిలిపివేశారు. శిక్షణా కార్యక్రమాలు తగ్గడంతో ఆర్థిక విధానాల్లో కఠిన మార్పులను అవసరం చేశాయి.



ఏ వి రాజన్

ప్రతి అనుభవం నా దృష్టిని విస్తరించింది; 2020లో నా పదవీ విరమణ నాటికి డైరెక్టర్ – అనేక సంస్థల మాదిరిగానే, ఏపీఎంఏఎస్ కూడా ప్రాధాన్యతలు మారడంతో కొందరు నిధుల ఆర్థిక ఒత్తిడి మరింత పెరిగింది. ఈ పరిస్థితులు 2020లో కరోనా మహమ్మారి ఈ ఒత్తిడిని మరింత తీవ్రతరం చేసింది. ఆ సంక్షోభ సమయంలో ఏపిమాస్ నిజమైన బలం, విలువలు వెలుగులోకి వచ్చాయి. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో కూడా బృందాలు తమ కార్యాచరణ ప్రాంతాల్లో సమాజానికి సేవలను కొనసాగిస్తూ, అవసరమైన సహాయ, ఉపశమన చర్యలు చేపట్టాయి. ■

**ఇతరులు నిన్ను నమ్మాలంటే , ముందుగా నిన్ను నీవు నమ్మాలి**

# సంస్థను మించి, ఉద్యమ శక్తి కేంద్రంగా ఎదిగి ... !

కేవలం రుణాలు అందించే సంస్థగా కాకుండా, నేర్చుకునే, ఆత్మపరిశీలన చేసే, సంస్థాగత నిర్మాణానికి దోహదపడే ప్రేరకశక్తిగా ఏపిమాస్ ఆవిర్భవించింది. కొద్ది కాలంలోనే ఏపిమాస్ ఒక సంస్థ కంటే ఎక్కువగా , మొత్తం ఉద్యమానికి బలాన్ని, స్ఫూర్తిని యిచ్చే కేంద్రంగా ఎదిగింది.



తరుణ్ దేబనాథ్
అభివృద్ధిరంగ నిపుణుడు

ఎస్ హెచ్ జిలు, సమాఖ్యలు, జీవనోపాధి సమూహాల సామర్థ్యాలను పెంపొందించాలనే దీర్ఘకాల దృష్టితో, ఏపిమాస్ జాతీయ స్థాయి వనరుల సంస్థల నెట్‌వర్క్‌ను (ఎన్ ఎన్ ఆర్ ఓ) ప్రారంభించింది. తరువాత దీనిని ' ఎనేబుల్ ' అని పేరు మార్చారు.

ఎనేబుల్ ద్వారా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల సంస్థలు ఒక జాతీయ అధ్యయన వేదికగా ఏకమయ్యాయి. నాబార్డ్, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ,యు ఎన్ డి పి, టాటా ట్రస్ట్, డి జి ఆర్ వి, వంటి జాతీయ, అంతర్జాతీయ సంస్థల గుర్తింపును ఏపిమాస్ పొందింది. ఈ గుర్తింపు యాదృచ్ఛికం కాదు; ఏపిమాస్ ఒక నిర్వాహక సంస్థగా కాకుండా, పరస్పర గౌరవంతో సహకారాన్ని పెంపొందించే సౌకర్యదాయక సంస్థగా నిర్మించుకున్న విశ్వసనీయతకు ఇది నిదర్శనం.

ఏపిమాస్ కు అత్యంత ప్రత్యేకమైన , చిరస్థాయిగా నిలిచే కృషిలో 'స్వయం నియంత్రణ' (ఎస్ ఓ సి) భావనను ప్రోత్సహించడం ముఖ్యమైంది. సూక్ష్మరుణ రంగంలో బాహ్య నియంత్రణలపై చర్చలు జరుగుతున్న సమయంలో, ఏపిమాస్ ఒక శక్తివంతమైన ఆలోచనను ముందుకు తెచ్చింది. అదే ... 'ఎస్ హెచ్ జి మాది. సమాఖ్య మాది. నిర్వహణ, నియంత్రణ కూడా మాదే కావాలి." అనే నినాదం.

రజతోత్సవ సందేశం!

2000లో ప్రారంభమైన ఈ ప్రయాణాన్ని వెనక్కి చూసుకుంటే, ఎస్ హెచ్ జి ఉద్యమం ఇంకా కొనసాగుతూనే ఉంది. పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత అనే లక్ష్యాల వైపు అది ఇంకా ప్రయాణిస్తోంది. విజయాలతోపాటు సవాళ్ళుకూడా ఎదురయ్యాయి. యాజమాన్యం, బాధ్యత, జవాబుదారీతనం వంటి ప్రశ్నలు ఇప్పటికీ కీలకంగా ఉన్నాయి. ■

## నిరంతర అభ్యాసం, నాణ్యత పట్ల శ్రద్ధ సిబ్బందిని నడిపించే మూలసూత్రాలు

ఏపిమాస్ ప్రారంభ దశలో చేరిన మాలో చాలామంది, తర్వాత ఇతర మార్గాల్లోకి వెళ్లిపోయినా, సంస్థతోనూ, ఒకరితో ఒకరితోనూ ఉన్న బంధం మాత్రం ఇంకా బలంగానే కొనసాగుతోంది. నా కోసం అది ఒక కలల ప్రయాణం. హైదరాబాద్‌లో అభివృద్ధి రంగంలో నాకు స్థిరమైన స్థానం కల్పించడమే కాకుండా, నా వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచుకునే అవకాశాన్ని కూడా ఏపిమాస్ ఇచ్చింది. వ్యక్తిగతంగాను, సంస్థాగతంగాను నేర్చుకున్న పాఠాలు అపారమైనవి. 'నిరంతర అభ్యాసం', 'నాణ్యత పట్ల శ్రద్ధ' అనే విలువలు ఏపిమాస్ లో మా పనిని నడిపించిన మూలసూత్రాలు. మేము జట్టుగా చేపట్టిన ప్రతి కార్యంలో అత్యుత్తమత సాధించాలనే లక్ష్యంతో పనిచేశాం. మంచి పని ఇప్పటికీ అదే నిబద్ధతతో కొనసాగుతుండటం హృదయానికి హత్తుకునే విషయం. ఈ సంస్థను అందంగా తీర్చిదిద్దింది మనుషులా? లేక సంస్థే మనుషులను అందంగా మలిచిందా? అన్నది నాకు ఇప్పటికీ స్పష్టంగా తెలియదు. నేను ఇప్పుడు TISS లో పనిచేస్తున్నప్పటికీ, సి ఎస్ తో, ఆయన బృందంతో నా అనుబంధం కొనసాగుతూనే ఉంది.



శ్రీనివాస్ సూరిసెట్టి

సాహసం నిచ్చెనలాంటిది , అది నీకు తోడుంటే మిగతావన్నీ వాటికవే నిన్ను విజయ శిఖరానికి చేరుస్తాయి ■

# ప్రచార ఆర్భాటం లేకుండా సాధించిన గుర్తింపు!

కృష్ణగోపాల్ జి వి

రజితోత్సవ సందేశం!

గత ఎన్నో సంవత్సరాలుగా ఎస్ హెచ్ జి సమాఖ్యలు, వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థలను (ఎఫ్ పి ఓలను) ప్రజాస్వామ్య, సభ్యుల యాజమాన్య సంస్థలుగా బలోపేతం చేయడంలో ఏపిమాస్ విశేష పాత్ర పోషించింది. పరిపాలన, వ్యవస్థలు, నాయకత్వం, రంగ యాజమాన్యంపై దాని నిరంతర దృష్టి, పేదల సంస్థలను కేవలం సేవల పంపిణీ వేదికలుగా కాకుండా, స్వతంత్ర నిర్ణయ సామర్థ్యం కలిగిన సంస్థలుగా చూడాలనే భావనను బలపరిచింది.

ఏపిమాస్ ప్రయాణంలో ఒక ముఖ్యమైన అంశం, అతిశయోక్తి ప్రచారం లేకుండానే రంగంలో తన ప్రాసంగికతను మరియు గుర్తింపును నిలబెట్టుకోవడం.

ఇటీవలి సంవత్సరాల్లో ఏపిమాస్ తన ప్రారంభ దృష్టి పరిధిని దాటి, ఆరోగ్యం, పోషణ, నీటి వనరులు, జీవనోపాధులు, ప్రమాద నిర్వహణ, మరియు స్థైర్యత వంటి విస్తృత సామాజిక–ఆర్థిక అంశాలపై కూడా పని చేసింది. ఎస్ హెచ్ జిలు, ఫెడరేషన్లు , ఎఫ్& పి ఓలు ఈ సమస్యల నుండి వేరుగా ఉండవని ఈ దృక్పథం గుర్తిస్తుంది. బలమైన సామాజిక సంస్థల ఆధారంగా అమలు అయ్యే సమగ్ర అభివృద్ధి విధానం, స్థిరమైన , స్థానిక యాజమాన్య ఫలితాలను అందించగలదు.

ఏపిమాస్ తన తదుపరి ఇరవై ఐదు సంవత్సరాల ప్రయాణంలోకి ప్రవేశిస్తున్న ఈ సమయంలో, దాని ముందున్న అవకాశం కేవలం “ఇంకా ఎక్కువ చేయడం” మాత్రమే కాదు; అవసరమైన చోట “వేరుగా చేయడం” కూడా – తన బలాలను సమీకరించడం, దృష్టిని పదును పెట్టడం, సంస్థాగత ప్రభావాన్ని మరింత లోతుగా చేయడం. ■

## వృత్తి జీవిత, వ్యక్తిగత జీవిత పాఠాలు నేర్పి, అండగా నిలిచే ఏపిమాస్



సుధారాణి ముళ్ళపూడి

ఏపిమాస్ తో నా అనుబంధం గురించి రాయడం నాకు ఎంతో ఆత్మీయంగా అనిపిస్తుంది. అది నా జీవితంలో అభివృద్ధి రంగంలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ అత్యంత ముఖ్యమైన పాఠాలను నేర్చుకునే సంవత్సరాలను తిరిగి గుర్తుచేసుకున్నట్లుగా ఉంటుంది. ఏపిమాస్‌లో కెపాసిటీ బిల్డింగ్ ఆఫీసర్‌గా నాకు అవకాశం లభించింది. ఆ అవకాశం నా వృత్తి జీవితానికి ఎంతో కీలకమైంది. ఎందుకంటే స్వయం సహాయక సంఘాల ఉద్యమం, మహిళా నాయకత్వం, జిల్లా పరిపాలనతో సమన్వయం వంటి అనేక విషయాలను నేర్చుకున్నది ఇక్కడే. సి.ఎస్. గారి ఉత్సాహం, సమతుల్య దృక్పథం ఏపిమాస్ బృందంపైనా గొప్ప ప్రభావం చూపింది. ఆ బృందం ఎప్పుడూ ప్రోత్సహించడం, అనుసంధానం చేయడం, సహకరించడం, వ్యక్తిగత ఎదుగుదలను నిజాయితీగా అభినందించడం మానదు. ఏపిమాస్‌లోని ఆప్యాయత, సంస్థాగత సంస్కృతి నన్నెప్పుడూ ఇంటివాతావరణంలో ఉన్నట్టే అనిపింపజేస్తాయి. సంస్థాగత నిర్మాణం, సమాఖ్యల బలోపేతం, మహిళా సాధికారత రంగాల్లో ఎన్నో మైలురాళ్లు సాధించిన ఏపీఎంఏఎస్, ఇకపై మహిళలు వ్యాపార రంగంలో ముందుకు సాగేందుకు మార్గనిర్దేశం చేసే కీలక పాత్ర పోషిస్తుందని నేను గట్టిగా నమ్ముతున్నాను. ■

చదవదగిన పుస్తకాలు లేని ఇల్లు ఆత్మ లేని శరీరం లాంటిది

# గ్రామీణ మహిళల ముఖాల్లో చిరునవ్వులు చిందించిన విజయం!

ఇరవై ఐదు సంవత్సరాల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న ఏపిమాస్ భారతదేశంలో కమ్యూనిటీ సంస్థలను బలోపేతం చేయడం, సమగ్ర ఆర్థిక సేవలను ప్రోత్సహించడం, గ్రామీణ స్థాయి అభివృద్ధికి తోడ్పడడం వంటి అంశాలలో ఒక కీలక మైలురాయిని చేరుకుంది. ఈ సంవత్సరాల పాటు ఏపిమాస్ అభివృద్ధి రంగంలో, ముఖ్యంగా స్వయం సహాయక సంఘాలు ,ఎస్ హెచ్ జి ల, వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్ పి ఓలు) , ఇతర కమ్యూనిటీ ఆధారిత సంస్థలను బలోపేతం చేయడంలో ఒక ప్రముఖ సంస్థగా ఎదిగింది. స్థిరమైన అభివృద్ధి బలమైన స్థానిక సంస్థలు , సాధికారత పొందిన సమాజాల పునాదులపై నిర్మించబడాలని విశ్వసిస్తూ ఏపిమాస్ తన కార్యకలాపాలను ముందుకు నడిపించింది.



ఎస్.ఎస్. భట్, హిమాన్షు వాఘేలా, ఎఫ్ డబ్ల్యు డబ్ల్యు,బి

**ఒకే లక్ష్యం – ఉమ్మడి దృష్టి**

ఏపిమాస్ , ఎఫ్ డబ్ల్యు డబ్ల్యు,బి (ఫ్రెండ్స్ ఆఫ్ విమెన్స్ వర్ల్డ్ బ్యాంకింగ్ మధ్య సహకారం ఎంతో అర్థవంతమైనదిగా, ప్రభావవంతమైనదిగా నిలిచింది. సంస్థల నిర్మాణం , మహిళలను ఆర్థిక వ్యవస్థలో ముందంజలో నిలబెట్టడం అనే ఉమ్మడి దృష్టితో ఈ రెండు సంస్థలు పనిచేశాయి.

రజతోత్సవ సందేశం!

ఏపిమాస్ సీఈఓ శ్రీ సి.ఎస్. రెడ్డి , ఎఫ్ డబ్ల్యు డబ్ల్యు,బి మాజీ సీఈఓ దివంగత శ్రీమతి విజయలక్ష్మి దాస్ గారి నాయకత్వం ఈ దిశగా విశేషంగా తోడ్పడింది. మహిళల ఆధ్వర్యంలో నడిచే సంస్థలను బలోపేతం చేయడంలో ఈ ఇద్దరు నాయకులు అంకితభావంతో పనిచేశారు.

ఏపిమాస్ 25వ వార్షికోత్సవం గత విజయాలను గుర్తు చేసుకునే సందర్భమే కాకుండా, భవిష్యత్తులో మరింత బలమైన సంస్థలు మరియు సమగ్ర ఆర్థిక వ్యవస్థల నిర్మాణం కోసం సంయుక్త చర్యలకు నూతన ఆరంభం కూడా.

ఎఫ్ డబ్ల్యు డబ్ల్యు,బి మొత్తం బృందం తరపున శ్రీ సి.ఎస్. రెడ్డి గారికి , అంకితభావంతో పనిచేస్తున్న ఏపిమాస్ బృందానికి హృదయపూర్వక శుభాకాంక్షలు.

రెడ్డి గారూ, మీరు నిర్మించిన ఈ సంస్థ గ్రామీణ మహిళల ముఖాల్లో చిరునవ్వులు తీసుకువచ్చింది. ఇది నిజంగా ఒక అసాధారణమైన విజయం! ■

## విభిన్న చిరస్మరణీయ అనుభవాల వ్యక్తిత్వ వికాస కేంద్రం

2026 ఏప్రిల్ నాటికి, ఏపిమాస్‌తో నా అనుబంధానికి ఆరు సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ ప్రయాణం ఎన్నో మధుర జ్ఞాపకాలు, నిరంతర అభ్యాసం, భాగస్వామ్య అనుభవాలు, విభిన్న సవాళ్లు, విభేదాలు, కఠిన నిర్ణయాలు, వ్యక్తిత్వ వికాసంతో నిండిపోయింది. APMAS ఒక యువ ప్రజా విధాన నిపుణుడిని విభిన్న దృక్పథాలు, నైపుణ్యాలతో కూడిన పరిపక్వ వృత్తి నిపుణుడిగా తీర్చిదిద్దింది. ఈ ఆరు సంవత్సరాలు క్షణాల్లో గడిచిపోయినట్టే అనిపిస్తున్నాయి. నేర్చుకోవాలనే, పంచుకోవాలనే, కలిసి పనిచేయాలనే తపన మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఏపిమాస్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా, దాని ప్రభావవంతమైన ప్రయాణంలో కొంతకాలం అయినా చిన్న పాత్ర పోషించే అదృష్టం నాకు దక్కినందుకు సంతోషంగా ఉంది. వ్యక్తులు వస్తారు, వెళ్తారు; కానీ ఏపిమాస్ వారసత్వం చిరస్థాయిగా కొనసాగుతూ, ఈ రంగంలో మరెన్నో సంస్థలకు, వ్యక్తులకు ప్రేరణగా నిలవాలని నా హృదయపూర్వక శుభాకాంక్షలు ■



వేద్ ప్రకాశ్ సింగ్

గెలుపును నిర్దేశించేది అదృష్టం కాదు, ఎంచుకునే తీరు

# పర్యావరణ ఉద్యమనేత కె. ఎస్. గోపాల్ కన్నుమూత

**సు**స్థిర వ్యవసాయ రంగానికి మార్గదర్శకుడిగా, గ్రామీణాభివృద్ధి ఉద్యమకారుడిగా, పర్యావరణ పరిరక్షకుడిగా జీవితాంతం అంకితభావంతో పనిచేసిన శ్రీ కె.ఎస్. గోపాల్ హైదరాబాదులోని బసవతారకం ఇండో–అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రిలో క్యాన్సర్ చికిత్స పొందుతూ 2026 మే 16న పరమపదించారు. ఆయనకు భార్య రమా రాజగోపాల్, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

శ్రీ కె.ఎస్. గోపాల్ గ్రామీణ జీవనోపాధుల బలోపేతం, సహజ వనరుల సంరక్షణ, కరువు , నీటి కొరత ప్రాంతాలలో రైతుల సంక్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. ఆయన డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ సహ స్థాపకులు. అనంతరం ఆ సంస్థ నుంచి బయటకు వచ్చి కూడా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, 1993లో హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కన్సెర్న్స్ (సిఇసి)లో చేరారు.

వ్యవసాయ పునరుజ్జీవనానికి 'స్వార్ ' (సిస్టమ్ ఆఫ్ వాటర్ ఫర్ అగ్రికల్చర్ రీజువెనేషన్ ) అనే వినూత్న సాగునీటి విధానాన్ని అభివృద్ధి చేసినందుకు ఆయన చిరస్మరణీయులు. గురుత్వాకర్షణ శక్తి ఆధారంగా విద్యుత్ అవసరం లేకుండా నీటిని నేరుగా మొక్కల వేర్ల వద్దకు చేరవేసే ఈ విధానం నీటి వృథాను, నేల ఉప్పదనాన్ని గణనీయంగా తగ్గించడంతో పాటు నేల ఆరోగ్యాన్ని, సూక్ష్మజీవుల క్రియాశీలతను మెరుగుపరుస్తుంది. ఈ సాంకేతికతకు పారిస్, వాషింగ్టన్‌లలో గ్లోబల్ ఇన్నోవేషన్ అవార్డులతో సహా అంతర్జాతీయ గుర్తింపు లభించింది.

గ్రామీణ ప్రజల జ్ఞానాన్ని విధాన నిర్ణేతల మెదడుకు ఎక్కించే నిర్భయ స్వరం ఆయనది. ప్రపంచ బ్యాంక్ ఉపాధ్యక్షుడితో మాట్లాడినా, భారత ప్రధానమంత్రితో చర్చించినా, దాతృసంస్థల ప్రతినిధులతోనైనా, క్షేత్రస్థాయి కార్యకర్తలతోనైనా, రైతులతోనైనా, స్వయం సహాయక సంఘాల మహిళలతోనైనా – ఆయన దృక్పథం ఎప్పుడూ ఒకటే. ముందు శ్రద్ధగా వినేవారు. ప్రజల వాస్తవ స్థితిగతులను అర్థం చేసుకునేవారు. ఆ తర్వాత వారి దృక్కోణం నుంచే విధానాలను పునర్నిర్వచించేవారు. గ్రామీణ వాస్తవ పరిస్థితులను జాతీయ విధానాలతో అనుసంధానించగల ఆయన విశ్లేషణా సామర్థ్యం, భాషా ప్రావీణ్యం, ఆలోచనల పదును అపూర్వం!

జహీరాబాద్ ప్రాంతంలోని మహిళా సంఘాల ద్వారా దళిత, ఆదివాసీ మహిళలను రైతులుగా, విత్తన సంరక్షకులుగా, పర్యావరణ జ్ఞానానికి వారసులుగా తిరిగి గుర్తింపు పొందేలా చేశారు. "ఆహార సార్వభౌమత్వం" అనే భావన అంతర్జాతీయ అభివృద్ధి రంగంలో ప్రాచుర్యం పొందకముందే ఆయన దానిని ఆచరణలో చూపించారు.

ఆయన అత్యంత విశిష్టమైన కృషిలో ఒకటి, ప్రధానమంత్రి డా. మన్మోహన్ సింగ్ హయాంలో రూపొందిన 'జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం' (ఎంజిఎన్ ఆర్ఇజిఎస్)కు భావనాత్మక పునాది వేయడంలో పోషించిన పాత్ర. ప్రజా పనుల్లో కూలిపని యిచ్చే సొమ్ము దానం కాదు, దయ కాదు, అది ఒక హక్కు అని గోపాల్ గారు బలంగా వాదించారు.

ఆకలి, గౌరవం గురించి ఆయనకు ఉన్న లోతైన అవగాహన రైస్ క్రెడిట్ లైన్ అనే వినూత్న కార్యక్రమానికి దారి తీసింది. ఎఫ్‌సీఐ గోదాముల్లో నిల్వ ఉన్న మిగులు ధాన్యాన్ని మహిళా స్వయం సహాయ సంఘాల ద్వారా గ్రామీణ పేద కుటుంబాల ఆహార భద్రత అవసరాలతో అనుసంధానించారు. ఈ ఆలోచన తరువాత అనేక రాష్ట్రాల్లో అమలైన కమ్యూనిటీ ఫుడ్ బాస్కెట్ వ్యవస్థలకు మార్గదర్శకమైంది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, మరింత న్యాయసమ్మతమైన, సుస్థిరమైన, పర్యావరణపరంగా దృఢమైన భవిష్యత్తు వైపు మనలను నడిపించే ఆయన వారసత్వం చిరస్థాయిగా కొనసాగాలని ఆశిద్దాం. ■

విమర్శిస్తున్నారని కుంగిపోకు అవే నీకు చైతన్య గీతాలు, రేపటి ప్రశంసలకు నాందీవాచకాలు

# అభివృద్ధి రంగంలో ఒక భిన్నమైన ప్రజాస్వామ్య సంస్థ !

రజితోత్సవ సందేశం!

నేను సి.ఎస్. రెడ్డిని 1980ల చివరలో కలిశాను. ఆ సమయంలో ఆయన అమెరికా ఆధ్వర్యంలోని ప్రపంచ ఆహార సహాయ సంస్థ అయిన 'కేర్ ఇంటర్నేషనల్ ' లో పనిచేస్తున్నారు. కేర్ సంస్థ రాష్ట్రంలో ఆహారాన్ని దిగుమతి చేసి, అవసరమైన పేదలకు చేరేలా చూసేది. ఆయన అనేక ప్రభుత్వ అధికారులతో సన్నిహితంగా పనిచేసేవారు.

ఈ ఒత్తిడితో కూడిన పనిలో, హైదరాబాద్ పౌరసమాజంలోని తీవ్రవాద, అమెరికా వ్యతిరేక అభివృద్ధి వర్గాల నుంచి ఆయనకు పెద్దగా సహానుభూతి లభించలేదు. ఆయనను చాలా సొగసైన, విజయవంతమైన "కార్పొరేట్ శైలి అభివృద్ధికార్యనిర్వాహకుడు"గా భావించేవారు. సంక్షిప్తంగా చెప్పాలంటే, మార్పు కోసం పోరాడే వ్యక్తి కంటే, పరిపాలనా ధోరణి కలిగిన అధికారి అనే అభిప్రాయం ఉండేది.

ఆ సమయంలో నేను ముప్పై ఏళ్ల వయస్సులో ఉన్నాను; స్వచ్ఛంద సంస్థల పట్ల బలమైన నమ్మకం కలిగి ఉన్నాను. 1990ల చివరలో సి.ఎస్. రెడ్డి, నిర్వహణ నేపథ్యం కలిగిన అలోయ్షియస్ ఫెర్నాండెజ్ , విజయ్ మహాజన్ వంటి నిపుణులతో కలిసి పనిచేస్తూ నేర్చుకుంటున్నారు. వీరు, పెరుగుతున్న అంతర్జాతీయ ఆర్థిక మద్దతుతో,ఐక్యతతో, ఎన్జీఓలు పెద్ద స్థాయిలో సేవలందించగల సాధనాలని ముందుగానే గుర్తించిన పథప్రదర్శకులు. ప్రభుత్వంతో ఎలా పని చేయాలో సి ఎస్‌కు స్పష్టమైన అవగాహన ఉండేది; విస్తరణకు అది అత్యంత కీలకం.

**ఏపిమాస్ ఆవిర్భావ ప్రత్యేకత**

ఈ విధంగా ఆలోచించి పుట్టిన ఎన్జీఓ మరొకటి లేదు. ఏపిమాస్ ఏర్పాటులోని నేపథ్యాన్ని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. 1998లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామీణ పేదరిక నిర్మూలన కోసం స్వయం సహాయక సంఘాలను (ఎస్ హెచ్ జి లను) ప్రోత్సహించేందుకు 'సెర్ప్' (సొసైటి ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ) ను స్వతంత్ర సంస్థగా స్థాపించింది. తరువాత ప్రపంచ బ్యాంకు మద్దతుతో అనేక కార్యక్రమాలు అమలయ్యాయి.

ఎస్ హెచ్ జి ఉద్యమాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఎన్జీఓలు, బ్యాంకులు, మైక్రో ఫైనాన్స్ సంస్థలు కలిసి పనిచేస్తున్నాయి. అయితే సెర్ప్ కేవలం రుణాల సంస్థగా మారి, మహిళల శక్తివంతీకరణ అనే మూల లక్ష్యాన్ని నిర్లక్ష్యం చేస్తుందనే భయం వాటిలో ఉండేది. ఎస్ హెచ్ జి ల నాణ్యతకు మహిళల స్థాయి బలోపేతమే ప్రధానమని అవి నమ్మాయి.

దీంతో ప్రభుత్వం నాబార్డ్ , ఎస్ హెచ్ జి లతో పనిచేస్తున్న రాష్ట్రస్థాయి ఎన్జీఓలతో సంప్రదింపుల సమావేశాలు నిర్వహించింది. ఆ తరువాత విజయ్ మహాజన్ అధ్యక్షతన ఒక వర్కింగ్ గ్రూప్ ఏర్పడి, 1998లో ఒక కాన్సెప్ట్ పేపర్ సమర్పించింది. ఎస్ హెచ్ జి లను బలోపేతం చేయడానికి, ఎస్ హెచ్ జి ప్రోత్సాహ సంస్థలకు సాంకేతిక మార్గదర్శకత్వం అందించడానికి ఒక స్వతంత్ర రాష్ట్రస్థాయి సంస్థ అవసరమని అందులో సూచించబడింది. ప్రజా జవాబుదారీతనం కలిగిన స్వతంత్ర సంస్థగా అది ఉండాలని ప్రతిపాదించారు.



కె.ఎస్. గోపాల్
పర్యావరణవేత్త

**యాజమాన్యం: ప్రజాస్వామ్య మార్గం**

వివిధ ఎంపికలను పరిశీలించిన తర్వాత, 'ట్రస్ట్' కంటే 'సొసైటీ' అనే చట్టపరమైన రూపాన్ని ఎంచుకున్నారు. పౌర సమాజంలోని శక్తి రాజకీయాలను అర్థం చేసుకోవడానికి ఈ తేడా చాలా ముఖ్యమైనది.

- ట్రస్ట్‌లో: ఒక ట్రస్టీనే తరచుగా తుది అధికారం కలిగిన యజమాని అవుతాడు.
- సొసైటీలో: సభ్యులు నిర్వహణ కమిటీని ఎన్నుకునే ప్రజాస్వామ్య నిర్మాణం ఉంటుంది.

చాలా ఎన్జీఓలు ట్రస్ట్‌లుగా ఉంటాయి. తాము స్వంతంగా పెద్దగా పెట్టుబడి పెట్టకపోయినా, సంస్థపై సంపూర్ణ నియంత్రణ కలిగి ఉంటాయి. కానీ ఏపిమాస్ కోసం

ప్రత్యామ్నాయాలు ఎంతగా ఎక్కువైతే , లక్ష్యం అంతగా పక్కదారి పడుతుంది

సి ఎస్ ప్రజాస్వామ్య మార్గాన్ని ఎంచుకున్నారు.

**చైతన్యం ... అమలు**

సెర్ప్ తో కలిసి పనిచేసే అవకాశం ఎన్జీఓలకు ఉన్నప్పటికీ, మహిళల సామర్థ్య నిర్మాణం అనే సెర్ప్ లక్ష్యానికి సేవ చేయడానికి చాలా సంస్థలు ముందుకు రాలేదు.

కొన్ని తీవ్రవాద ఎన్జీఓలు ఏపిమాస్ ను "ఒక కాంట్రాక్టర్ సంస్థ"గా విమర్శించాయి. అయితే అదే సంస్థలు మహిళల సమూహాలతో వ్యవహరించేటప్పుడు "సామంత ధోరణి" ప్రదర్శించగా, దాతల విషయంలో "మధ్యవర్తి" ధోరణి అవలంబించేవి.

ఏపిమాస్ మాత్రం మహిళల శక్తివంతీకరణను ప్రధాన లక్ష్యంగా తీసుకుని సెర్ప్ ఆదేశాన్ని అమలు చేయడంలో తన మిషన్‌ను కనుగొంది. కేవలం ప్రభుత్వ నిధులపై ఆధారపడకుండా ఉండేందుకు ఏపిమాస్ ఎఫ్ సి ఆర్ ఏ కింద నమోదు చేసుకుంది.

**ప్రమాణాలను పెంచడం**

2010 ప్రాంతంలో ఏపిమాస్, సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కన్సర్న్స్ (సి ఇ సి) కు మద్దతుగా, వినియోగంలో లేని పల్లపు భూములను ఉత్పాదకంగా మార్చే అవకాశాలను పరిశీలించింది. సి ఎస్ ఆ ప్రాజెక్టును సందర్శించినప్పుడు నేను కూడా ఆయనతో వెళ్లాను. ఆయన పని వివరాలను లోతుగా అడుగుతుండగా, నేను ఫీల్డ్ సిబ్బంది చెప్పే కథనాలనే వింటున్నాను.

అప్పుడు నాకు సి ఇ సి పరిపాలనా పరిమితులు అర్థమయ్యాయి. కొలవగల ఫలితాలను సాధించడానికి అవసరమైన ప్రక్రియల విలువ నాకు స్పష్టమైంది. కేవలం సిద్ధాంతాలు కాదు; ఫలితాలు ఇవ్వాలి.

ఈ విధానం ఏపిమాస్ బృంద స్థాయిలో కూడా ప్రతిఫలించింది. అనంతపురం జిల్లాలో స్వార్ (సిస్టమ్ ఆఫ్ వాటర్ ఫర్ అగ్రికల్చర్ రిజునవేషన్) అనే సాగునీటి విధానాన్ని అమలు చేస్తున్నప్పుడు, రైతులతో వ్యవహరించే విధానాన్ని మరియు ఫలితాలను కొలిచే పద్ధతులను ఏపిమాస్ ఎంత విలువైనవిగా భావిస్తుందో చూశాను.

సి ఇ సి అభివృద్ధి చేసిన "లివింగ్ కంపోస్ట్" సాంకేతికతపై ఏపిమాస్ వీడియో రూపొందించింది. రైతులతో విస్తృతంగా ఆ పద్ధతిని అమలు చేసి, ఉత్పత్తుల నాణ్యతను పరీక్షించేందుకు అవసరమైన పరికరాలను కూడా సమకూర్చింది.

ఇది ఏపిమాస్ దాతల అవసరాలకే పరిమితం కాకుండా, తన స్వంత ప్రమాణాలను పెంచుతూ పనిచేస్తుందనే విషయాన్ని స్పష్టం చేసింది. మదనపల్లెలో టమోటా సాగు వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్ పి ఓల) మార్కెటింగ్ పై జి ఐ జడ్ తో కలిసి రూపొందించిన నివేదిక ఒక ఉన్నత స్థాయి సాంకేతిక పుస్తకంగా నిలిచింది.

ఏపిమాస్ తన అన్ని కార్యక్రమాలలో ప్రమాణాలను పెంచేందుకు కృషి చేస్తుంది. ఇది సంస్థ సిబ్బంది నైపుణ్యాన్ని, పనితీరును, సంస్థ స్థిరత్వాన్ని పెంచుతుంది. కేవలం దాతల అవసరాలను తీర్చడానికే కాకుండా, సంస్థను సమృద్ధిగా, సుస్థిరంగా నిర్మించడానికి ఇది అవసరం.

**ఒక భిన్నమైన దృక్పథం**

చాలా సేవా సంస్థలు తమ "సంస్థ"ను ప్రోత్సహించడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాయి. సంస్థ అనేది కేవలం ఒక సాధనం మాత్రమే; లక్ష్యం ప్రజల సేవ అనే విషయం మరచిపోతాయి.

ఈ ధోరణి ఎన్జీఓల స్ఫూర్తిదాయక శక్తిని తగ్గించింది; నైతిక విలువలపై రాజీ పడే పరిస్థితులకు దారితీసింది. ఈ విషయంలో ఏపిమాస్ ప్రత్యేకంగా నిలిచింది.

ఏపిమాస్ తనను ఒక "ఏజెన్సీ"గా భావిస్తూ సెర్ప్ వంటి సంస్థలతో కలిసి పనిచేసింది. ఈ విధానంలో మహిళల ఎస్ హెచ్ జిలే ప్రధానంగా కనిపించాయి; కీర్తి కూడా వాటికే దక్కింది. ఏపిమాస్ మాత్రం నిశ్శబ్దంగా వాటి సాధికారత ప్రయాణంలో తోడ్పడింది.

మనకు తరచూ పెద్ద బోర్డులపై సంస్థల లేదా దాతల పేర్లు కనిపిస్తాయి; కానీ ప్రజల పేర్లు కనిపించవు. ఏపిమాస్ మాత్రం రైతు ఉత్పత్తిదారుల సమూహాలు, సహకార సంఘాలతో పనిచేసేటప్పుడు కూడా "ఏజెన్సీ" విధానాన్నే అనుసరించింది.

మిషన్‌ను నిబద్ధతతో అమలు చేయడం ద్వారానే అభివృద్ధి సంస్థలు తమ గౌరవాన్ని సంపాదించాలి.

భవిష్యత్తులో కూడా ఏపిమాస్ ఈ "ఏజెన్సీ" పాత్రను ఎలా కొనసాగిస్తుందో గమనించాలి. ప్రజలకు సేవ చేస్తున్నామని చెప్పుకునే ఎన్జీఓలు, దాతలు ఈ విధానాన్ని లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ■

**జీవితం ఒక అద్భుతమైన వరం, పనికి మాలిన ఆలోచనలతో దానిని వ్యర్థం చేసుకోకు**

# తల్లి పాల ప్రాముఖ్యతపై ఆశాలకు అవగాహన సందర్శన

– జాహ్నవి ఎర్రబెల్లి

ఏపిమాస్ పట్టణ పోషణ పథకం బృందం వారు మే 12వ తేదిన గుడిమల్కాపూర్ ,కార్వాన్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లకు చెందిన 24 మంది ఆశా కార్యకర్తలను నీలోఫర్ ఆసుపత్రిలోని 'ధాత్రి తల్లి పాల బ్యాంక్' కు అవగాహన సందర్శనకు తీసుకువెళ్ళారు. పాలిచ్చే తల్లుల ఆరోగ్యం, శిశు పోషణ , తల్లిపాల ప్రాముఖ్యతపై ఆశా కార్యకర్తలకు సమగ్ర అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. బస్తీలో నివసించే పాలిచ్చే తల్లులకు సరైన మార్గదర్శకత్వం, మద్దతు అందించే వారిలో ఆశా వర్కర్లు మొదటివారు. అందువల్ల ఆశా కార్యకర్తల సామర్థ్యాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో కూడా ఈ సందర్శనను నిర్వహించారు.



పాలిచ్చే తల్లులు ఎదుర్కొనే శారీరక , మానసిక సమస్యలపై వైద్య నిపుణులు, డా. భవిష్య వివరించారు. ముఖ్యంగా రొమ్ముల్లో నొప్పి, పాల నిల్వ వల్ల కలిగే ఉబ్బరం, పాల ఉత్పత్తి తగ్గిపోవడం, అలసట, ఒత్తిడి, ఆందోళన, శిశువుకు సరిగా పాలు పట్టించడంలో ఇబ్బందుల వంటి సమస్యలను వివరించారు. ఈ సమస్యలు తల్లి ఆరోగ్యంతో పాటు శిశువు పోషణపై కూడా ప్రభావం చూపుతాయని తెలియజేశారు. శిశువుల ఆరోగ్యకరమైన పెరుగుదల, రోగనిరోధక శక్తి పెంపు , మెదడు అభివృద్ధికి తల్లిపాలు ఎంతో కీలకమని వివరించారు. ముఖ్యంగా పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం, మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలే ఇవ్వడం ఎంత ముఖ్యమో తెలియజేశారు. నెల తక్కువ పిల్లలకు , తక్కువ బరువుతో పుట్టిన పిల్లలకు అనారోగ్యంతో ఉన్నపిల్లలకు తల్లిపాలు ప్రాణాధారమని వివరించారు.

పాల ఉత్పత్తిని పెంచేందుకు ఉపయోగపడే లాక్టేషన్ నిర్వహణ పద్ధతులు, మసాజ్ థెరపీ, సరైన ఆహారం, విశ్రాంతి, మానసిక ప్రశాంతత అవసరంపై అవగాహన కల్పించారు. పాల ఉత్పత్తి మెరుగుపడేందుకు అనుసరించాల్సిన పద్ధతులను ప్రదర్శనల ద్వారా వివరించారు.

పాలు ఇచ్చే తల్లుల ఎంపిక , వారికి నిర్వహించే ఆరోగ్య పరీక్షలు, తల్లి పాలను పరిశుభ్రంగా సేకరించడం, పాస్చరైజేషన్ ద్వారా పాల భద్రతను నిర్ధారించడం, సురక్షితంగా నిల్వ చేసే ప్రక్రియలను ప్రత్యక్షంగా చూపించారు. సమస్యల పాలైన శిశువులకు, ముఖ్యంగా నవజాత శిశు అత్యవసర చికిత్స విభాగం (ఎన్.ఐ.సి. యు)లో ఉన్న బిడ్డలకు సేకరించిన పాలను ఎలా అందజేస్తారో వివరించారు.

ఈ సందర్శన ద్వారా ఆశా కార్యకర్తలు తల్లి పాల బ్యాంక్ అనేది కేవలం తల్లిపాలు నిల్వ చేసే కేంద్రం మాత్రమే కాకుండా, తల్లులు , శిశువుల ఆరోగ్య పరిరక్షణకు సేవలు అందించే సమగ్ర కేంద్రం అని అవగాహన పొందారు. తల్లి పాల బ్యాంక్‌లో పరిశుభ్రత, భద్రత, నాణ్యత ప్రమాణాలను ఎంత కట్టుదిట్టంగా పాటిస్తారో ఆశా కార్యకర్తలు తెలుసుకున్నారు. పాలిచ్చే తల్లులకు సరైన మార్గదర్శనం చేసేందుకు ఈ సందర్శన ఆశా కార్యకర్తలకు ఎంతో ఉపయోగకరంగా నిలిచింది. ■

# రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం

– వై. తేజస్విని

ప్రతి సంవత్సరం మే 28న ప్రపంచవ్యాప్తంగా ‘ రుతుక్రమ పరిశుభ్రత నిర్వహణ దినోత్సవం (మెన్స్ట్రువల్ హైజీన్ మేనేజ్‌మెంట్ డే ) నిర్వహించబడుతుంది. రుతుక్రమంపై ఉన్న అపోహలను, బిడియాన్ని, వివక్షను తొలగించి కిశోర బాలికలలో, మహిళల్లో రుతుక్రమ అవగాహనను పెంపొందించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం. రుతుక్రమ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ఎంత ముఖ్యమో తెలియజేయడం కూడా ఈ దినోత్సవం లక్ష్యం.



ఈ సందర్భంగా మే 28న ఏపిమాస్ ‘పట్టణ పోషణ బృందం’ ఆధ్వర్యంలో మెహదీపట్నంలోని ఎస్.బీ.ఐ కమ్యూనిటీ హాల్‌లో రుతుక్రమ పరిశుభ్రత నిర్వహణ దినోత్సవాన్ని కార్యక్రమాన్ని పట్టణ పోషణ పథకం మేనేజర్ , ప్రాజెక్టు ఆఫీసర్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 30 మంది కిశోర బాలికలు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

కార్యక్రమంలో భాగంగా యంగిస్తాన్ సంస్థకు చెందిన వలంటీర్ సౌజన్య గారు పాల్గొని బాలికలకు రుతుచక్రం గురించి సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. అనంతరం ప్రాజెక్టు మేనేజర్ భవాని గారు రుతుక్రమ సమయంలో పాటించవలసిన తీరుపట్ల ఉన్న అపోహలు, వాటి వల్ల కలిగే ప్రభావాలు, ఆ సమయంలో సరైన పోషకాహారం తీసుకోవలసిన ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు , ఒక ఆశా కార్యకర్త కూడా పాల్గొని బాలికలకు ఆరోగ్య పరిరక్షణపై సూచనలు అందించారు.

శుభ్రమైన శానిటరీ ప్యాడ్ల వినియోగం, సమయానికి ప్యాడ్లు మార్చుకోవడం, చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి ముఖ్య విషయాలను వివరించారు. అలాగే ఉపయోగించిన ప్యాడ్లను సరైన విధంగా పారవేయకపోతే పర్యావరణంపైన, సమాజ ఆరోగ్యంపైన కలిగే ప్రతికూల ప్రభావాలను తెలియజేస్తూ, సరైన ప్యాడ్ డిస్పోజల్ పద్ధతులపై అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికల సహాయంతో నిర్వహించిన స్కిట్ ద్వారా, రుతుక్రమం ఒక సహజమైన శారీరక ప్రక్రియ అని, దీనిపై ఎటువంటి అపోహాలు లేదా భయాలు కలిగి ఉండాల్సిన అవసరం లేదని బాలికలకు సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు.

కార్యక్రమం ముగింపులో కిశోర బాలికలకు ‘రుతుక్రమ పరిశుభ్రత కిట్లు’ అందజేశారు. రుతుక్రమ పరిశుభ్రత అవగాహన కార్యక్రమంలో బాలికలకు పంపిణీ చేసిన ఈ కిట్లను ఏపిమాస్ ప్రధాన కార్యాలయ సిబ్బంది సమిష్టి సహకారంతో సిద్ధం చేసి, ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాలికలకు అందజేశారు.

ఈ కార్యక్రమం బాలికల్లో రుతుక్రమ ఆరోగ్యంపైన, వ్యక్తిగత పరిశుభ్రతపైన అవగాహన పెరగడంతో పాటు, మహిళల ఆరోగ్యం, ఆత్మ గౌరవం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో మెన్స్ట్రువల్ హైజీన్ మేనేజ్‌మెంట్ డే కీలక పాత్ర పోషిస్తుందని ఈ కార్యక్రమం మరోసారి గుర్తు చేసింది.

■

# ఘనంగా దహేగాం, ఉద్వల ఎఫ్ పి సిల వార్షిక మహాసభలు!

– జి. శ్రీనివాస్

**వ్య**వసాయ ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్ పి ఓలు, ఎఫ్ పి సిలు) గ్రామీణ వ్యవసాయ రంగంలో రైతుల ఐక్యతను పెంపొందిస్తూ, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే శక్తివంతమైన వేదికలుగా అభివృద్ధి చెందుతున్నాయి. ముఖ్యంగా మహిళలు, చిన్న , సన్నకారు రైతులు కలిసి వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, నిల్వ, మార్కెటింగ్, వ్యవసాయ అవసరాల సరఫరా వంటి రంగాల్లో సమిష్టిగా ముందుకు సాగుతున్న తీరు గ్రామీణాభివృద్ధికి కొత్త ఆశలను కలిగిస్తోంది.

ఈ నేపథ్యంలో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని దహేగాం మహిళా వ్యవసాయ ఉత్పత్తిదారుల కంపెనీ వార్షిక మహాసభ 2026 మే 26న, ఉద్వల వ్యవసాయ ఉత్పత్తిదారుల కంపెనీ వార్షిక మహాసభ 2026 మే 27న ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ రెండు మహాసభలు సభ్యుల భాగస్వామ్యం, వ్యాపారాభివృద్ధి, పారదర్శకత, భవిష్యత్ వ్యూహాలు మరియు మహిళా సాధికారతకు అద్దం పట్టాయి. ఈ కార్యక్రమాలలో ఏపిమాస్ సిబ్బంది పాల్గొని సభ్యులకు మార్గదర్శనం చేశారు.

**మహిళా నాయకత్వానికి ప్రతీకగా దహేగాం ఎఫ్ పి సి**

2026 మే 26న కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాం మండలంలోని రైతు వేదికలో దహేగాం మహిళ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ నాలుగవ వార్షిక మహాసభ ఘనంగా జరిగింది. 2023 జనవరిలో స్థాపించబడిన ఈ మహిళా రైతు సంస్థ ప్రస్తుతం 22 గ్రామపంచాయతీల పరిధిలో 395 మంది సభ్యులతో కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

ఈ మహాసభలో సంస్థకు చెందిన 10 మంది బోర్డు సభ్యులు హాజరయ్యారు. సుమారు 104 మంది సభ్యులు పాల్గొని మహాసభను విజయవంతం చేశారు. గ్రామీణ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనడం ఈ సంస్థ పట్ల ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబించింది.

**సంప్రదాయం, సమైక్యతకు ప్రతీక:** సభ ప్రారంభంలో జ్యోతి ప్రజ్వలన, ప్రార్థన గీతం, సభ్యులకు స్వాగతం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సంస్థ అధ్యక్షురాలు శ్రీమతి పిల్లల ప్రపూర్ణ స్వాగత ప్రసంగం చేస్తూ, సభ్యుల సహకారంతో సంస్థ ఈ స్థాయికి ఎదిగిందని , మహిళా రైతులు ఐక్యంగా ముందుకు సాగితే వ్యవసాయంలో ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతుందని, ప్రతి సభ్యురాలు సంస్థ అభివృద్ధిలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

**సభ్యుల భాగస్వామ్యం – సంస్థకు బలమైన పునాది:** దహేగాం మహిళా FPO పరిధిలో దహేగాం, కుంచవెల్లి, చౌక, పెసరికుంట, ఐనాం, లగ్గావ్, కొత్మీర్, హత్తిని తదితర గ్రామాల రైతులు సభ్యులుగా ఉన్నారు. మహిళా రైతులను సమీకరించి వ్యవసాయ రంగంలో సంఘటిత శక్తిగా నిలపడం ఈ సంస్థ ప్రత్యేకత. సంస్థ సభ్యులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పరికరాలు సరసమైన ధరలకు అందించడంతో పాటు పత్తి కొనుగోలు కార్యక్రమాలు కూడా నిర్వహిస్తోంది.

**వ్యాపారాభివృద్ధి వైపు అడుగులు:** 2025–26 ఆర్థిక సంవత్సర ప్రగతి నివేదికను మహాసభలో సభ్యుల ముందుంచి విపులంగా చర్చించారు. గత సంవత్సరంతో పోలిస్తే సంస్థ వ్యాపార కార్యకలాపాలు గణనీయంగా విస్తరించినట్లు వెల్లడించారు. ముఖ్యంగా పత్తి కొనుగోలు – అమ్మకాలు, ఎరువుల విక్రయాలు, పురుగుమందుల సరఫరా, వ్యవసాయ ఆర్థికేతర పెట్టుబడుల పంపిణీ వంటి కార్యకలాపాల ద్వారా సభ్య రైతులకు మెరుగైన సేవలు అందించినట్లు వివరించారు. అదేవిధంగా గ్రామస్థాయిలో రైతు అవగాహన కార్యక్రమాలు, శిక్షణలు నిర్వహించడం ద్వారా రైతులను సంఘటిత శక్తిగా తీర్చిదిద్దేందుకు కృషి చేసినట్లు తెలిపారు. మహాసభలో పాల్గొన్న ఏపిమాస్ ప్రతినిధులు సంస్థ వ్యాపారాభివృద్ధి, లాభదాయక కార్యకలాపాల విస్తరణ, సభ్యుల భాగస్వామ్యం పెంపు , భవిష్యత్ వ్యాపార ప్రణాళికలపై సభ్యులకు పలు



సూచనలు అందించారు.

**మహిళా సాధికారతకు మార్గదర్శకంగా ... :** మహిళల నాయకత్వం చురుకైన భాగస్వామ్యం దహేగాం మహిళా ఎఫ్ పి సి ప్రత్యేకత . గ్రామీణ మహిళలు కేవలం సభ్యులుగానే కాకుండా పాలకవర్గ సభ్యులుగా, నిర్ణయాధికారులుగా వ్యవహరిస్తూ సంస్థ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారు. మహిళా రైతులను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడానికి సంస్థ తరచుగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఎఫ్ పి సి నిర్వహణ, అకౌంటింగ్ విధానాలు, వ్యాపార ప్రణాళిక, సహజ వ్యవసాయం, మార్కెటింగ్ పద్ధతుల వంటి అంశాలపై పాలకవర్గ సభ్యులు మరియు మహిళా రైతులకు ప్రత్యేక శిక్షణలు అందించడం జరిగింది. ఈ శిక్షణల ద్వారా మహిళలు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడంతో పాటు వ్యవసాయ వ్యాపారంపై అవగాహన పెంచుకొని స్వయం నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదుగుతున్నారు. గ్రామీణ మహిళలలో ఆత్మవిశ్వాసం, సామాజిక గౌరవం , ఆర్థిక స్వావలంబన పెరగడంలో ఈ ఎఫ్ పి సి కీలక పాత్ర పోషిస్తోంది.

**విజన్ 2030 :** ఈ ఎఫ్ పి సి "విజన్-2030" దిశగా భారీ లక్ష్యాలతో ముందుకు సాగుతోంది. రైతుల ఐక్యతతో సుస్థిరమైన వ్యవసాయాభివృద్ధి, మెరుగైన ఆదాయం , సుసంపన్నమైన కుటుంబాల నిర్మాణమే ప్రధాన లక్ష్యంగా సంస్థ కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. 2030 నాటికి సభ్యత్వాన్ని గణనీయంగా పెంచడం, పత్తి , ఎరువుల వ్యాపారాన్ని విస్తరించడం, బ్యాంకు రుణాలు, క్రెడిట్ లింకేజీలను పొందడం, వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం, గ్రామస్థాయిలో సేవలను విస్తరించడం వంటి లక్ష్యాలను నిర్దేశించుకుంది. రైతులకు అవసరమైన వ్యవసాయ ఆర్థికేతర పెట్టుబడులను , మార్కెటింగ్ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు సంస్థ కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరిగింది. 2026--27 సంవత్సరానికి వ్యాపార ప్రణాళికలో రూ.77 లక్షలకు పైగా టర్నోవర్ లక్ష్యంగా నిర్ణయించడం సభ్యుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ లక్ష్యాలు రైతు ఉత్పత్తిదారుల సంస్థను భవిష్యత్తులో మరింత బలమైన వ్యాపార వేదికగా తీర్చిదిద్దనున్నాయని సభ్యులు విశ్వాసం వ్యక్తం చేశారు.

**ఉద్వల ఎఫ్ పి సి వార్షిక మహాసభ**

2026 మే 27న ఆసిఫాబాద్ పట్టణంలోని సంస్థ కార్యాలయంలో ఉద్వల వెఫ్ పి సి ఐదవ వార్షిక మహాసభ నిర్వహించబడింది. 2021లో స్థాపించబడిన ఈ సంస్థ ప్రస్తుతం 26 గ్రామపంచాయతీల పరిధిలో 651 మంది రైతు సభ్యులతో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. పత్తి, కందులు, ఎరువులు, పురుగుమందులు , వ్యవసాయ ఆర్థికేతర పెట్టుబడుల సరఫరాలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తోంది.

**చర్చించిన ముఖ్య అంశాలు :** మహాసభలో సంస్థ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చలు నిర్వహించబడ్డాయి. గత వార్షిక మహాసభలో తీసుకున్న తీర్మానాల అమలు స్థితిని సమీక్షించడంతో పాటు 2025-26 సంవత్సరానికి సంబంధించిన వార్షిక ప్రగతి నివేదికను సభ్యుల ముందుంచి ఆమోదించారు. అలాగే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ నివేదికలు, జమా-చెల్లింపుల వివరాలు, వ్యాపార లాభనష్టాల విశ్లేషణపై సభ్యులతో చర్చించారు. సంస్థ భవిష్యత్ దిశను నిర్దేశించే "విజన్-2030" కార్యాచరణ ప్రణాళికపై సభ్యులు తమ

అభిప్రాయాలు వ్యక్తం చేశారు. 2026--27 సంవత్సరానికి వ్యాపార ప్రణాళిక, అంచనా బడ్జెట్, టర్నోవర్ లక్ష్యాలపై చర్చించి ఆమోదించడం జరిగింది. అదేవిధంగా పాలకవర్గంలో ఖాళీగా ఉన్న స్థానాలకు కొత్త బోర్డు సభ్యుల ఎంపికపై కూడా చర్చించారు. మహాసభలో పాల్గొన్న సభ్యులు సంస్థ భవిష్యత్తు వ్యూహాలు, వ్యాపార విస్తరణ మరియు సభ్య సేవల మెరుగుదలపై ఉత్సాహంగా తమ సూచనలు అందించారు.

**వ్యాపార విస్తరణ – పెరిగిన టర్నోవర్:** ఉద్వలఎఫ్ పి సి 2025-26 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ. 61 లక్షల టర్నోవర్ సాధించడం విశేషం. గత సంవత్సరంతో పోలిస్తే ఇది దాదాపు రెట్టింపు వృద్ధి కావడం సంస్థ వ్యాపార విస్తరణకు నిదర్శనంగా నిలిచింది. ముఖ్యంగా పత్తి సేకరణ , విక్రయాలు, కందుల వ్యాపారం, పురుగుమందుల విక్రయాలు, ఎరువుల సరఫరా, వ్యవసాయ పరికరాల అమ్మకాలు వంటి కార్యకలాపాల ద్వారా సంస్థ సభ్య రైతులకు సేవలు అందించింది. రైతుల ఉత్పత్తులకు సరైన మార్కెట్ కల్పించడం, వ్యవసాయ ఆర్థికేతర పెట్టుబడులను ఒకే వేదిక ద్వారా అందించడం వల్ల సభ్యుల విశ్వాసం పెరిగింది. మహాసభలో పాల్గొన్న ఏపిమాస్ ప్రతినిధులు సంస్థ వ్యాపార కార్యకలాపాలను సమీక్షించి, వ్యాపార నియంత్రణ, ఖర్చుల తగ్గింపు, పెండింగ్ వసూళ్ల మెరుగుదల, లాభదాయక వ్యాపార అవకాశాల గుర్తింపు , టర్నోవర్ మరింత పెంపుపై సభ్యులకు సూచనలు అందించారు.

**శిక్షణలతో అభివృద్ధికి బాట :** ఉద్వల ఎఫ్ పి సి సభ్యులు, పాలకవర్గ సభ్యులు , సిబ్బంది సామర్థ్యాలను పెంపొందించేందుకు పలు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. వ్యాపార ప్రణాళిక రూపకల్పన, సహజ వ్యవసాయం, మార్కెటింగ్ విధానాలు, ట్యాలి అకౌంటింగ్, సంస్థ నిర్వహణ వంటి అంశాలపై నిపుణులచే శిక్షణలు అందించబడ్డాయి. ఈ శిక్షణల ద్వారా సభ్యులు మెరుగైన అవగాహన పొందడంతో పాటు సంస్థ నిర్వహణలో చురుకైన పాత్ర పోషించే స్థాయికి ఎదుగుతున్నారు.

**ఏపిమాస్ కీలక పాత్ర**

ఈ రెండు వార్షిక మహాసభల విజయవంతమైన నిర్వహణలో ఏపిమాస్ కీలకపాత్ర పోషించింది. హైదరాబాద్ ప్రధాన కార్యాలయం నుండి కన్సల్టెంట్ శ్రీ మహేష్ అలగప్ప, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీ జి. శ్రీనివాస్ , ఏపీమాస్ నిర్మల్ కార్యాలయం నుండి ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ రాజేశ్వర్ మరియు బిజినెస్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీ రాజేందర్ రెడ్డి పాల్గొని సభ్యులకు, పాలకవర్గ సభ్యులకు సంస్థ బలోపేతం, వ్యాపారాభివృద్ధి , భవిష్యత్ కార్యాచరణ, సంస్థల టర్నోవర్ పెంపు, సభ్యుల భాగస్వామ్యం బలోపేతం, లాభదాయక వ్యాపార కార్యకలాపాల గుర్తింపు, బ్యాంకు లింకేజీల సాధన, సభ్య సేవల విస్తరణ , వ్యాపార ప్రణాళిక అమలుపై విలువైన సూచనలు అందించారు.

**గ్రామీణాభివృద్ధికి భవిష్యత్ దిశ:** దహేగాం మహిళా ఎఫ్ పి సి , ఉద్వల ఎఫ్ పి సి వార్షిక మహాసభలు గ్రామీణాభివృద్ధికి ఎఫ్ పి సి ల ప్రాధాన్యతను స్పష్టంగా తెలియజేశాయి. భవిష్యత్తులో ఇటువంటి వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థలు మరింత బలపడితే గ్రామీణ వ్యవసాయ రంగంలో సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని సభ్యులు , ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ■

## సుభాష్ పాలేకర్ కృషి శిక్షణ తరగతులు

శిక్షణ తేదీ ... 2026 జూన్ 11 గురువారం నుండి జూన్ 15 సోమవారం వరకు

సమయం.. ఉదయం 8.00 నుండి రాత్రి 8.00 వరకు,

వేదిక...ఎస్వి విశ్వవిద్యాలయ ఆడిటోరియం, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, చంద్రగిరి రోడ్, తిరుపతి

వసతి....ఎస్వి విశ్వవిద్యాలయ వసతి గృహం హెచ్

ప్రవేశ రుసుము... ఐదు రోజులకు ఒక వ్యక్తికి 1500 రూపాయలు

ఆన్‌లైన్ చెల్లింపు కొరకు బ్యాంక్ వివరాలకై...

సంప్రదించండి: వనమాలి గుట్ట 9666911116, జైచంద్ర నాయుడు 9492484003, దివ్య ఆరోహ 9347578819

# సామాజిక బాధ్యతను చాటిన విప్రో ఉద్యోగుల సేవా కార్యక్రమం

– జాహ్నవి ఎర్రబెల్లి

ఏపిమాస్ పట్టణ పోషణ పథకం బృందం వారు మే 6 తేదీన హైదరాబాద్ గచ్చిబౌలిలోని విప్రో సంస్థకు చెందిన సుమారు 80 మంది ఉద్యోగులతో 'స్వచ్ఛంద సేవ' (వలంటీరింగ్) కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగుల్లో సామాజిక బాధ్యతను , కలిసి పనిచేసే భావనను, సృజనాత్మకతను, సమాజ సేవా స్ఫూర్తిని పెంపొందించే



ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ వాలంటీరింగ్ కార్యక్రమంలో మొత్తం 80 మంది ఉద్యోగులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభం నుండి ముగింపు వరకు ఉద్యోగులు చురుకుగా పాల్గొని, ఉత్సాహపూరితమైన వాతావరణాన్ని సృష్టించారు. ఉద్యోగులు ఒకరితో ఒకరు కలిసి పనిచేస్తూ తమ సృజనాత్మకతను ప్రదర్శించారు.

ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పెయింట్ బ్రష్‌లు, స్టెన్సిల్స్ , పెయింట్ రంగులు ఉపయోగించి "స్టార్ అమ్మ" "స్టార్ నాన్న సాష్‌లను అందంగా తయారు చేశారు. ప్రతి ఉద్యోగి ఎంతో ఆసక్తితో సాష్‌లపై డిజైన్లు, రంగులు వేస్తూ వాటిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పాల్గొన్న ఉద్యోగులు ఈ కార్యక్రమాన్ని ఎంతో ఆసక్తిగా ఆస్వాదించడమే కాకుండా, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమంలో తాము భాగమవడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ఈ "స్టార్ అమ్మ" సాష్‌లను ఆరోగ్యం , పోషకాహారానికి సంబంధించిన మంచి అలవాట్లు పాటిస్తున్న మహిళలను సత్కరించేందుకు ఉపయోగించనున్నారు. ముఖ్యంగా గర్భిణులు, తల్లులు ఐరన్ , ఫోలిక్ యాసిడ్ మాత్రలు క్రమం తప్పకుండా తీసుకోవడం, గర్భధారణ సమయంలో అవసరమైన ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం, పిల్లలకు సరైన సమయంలో పౌష్టికాహారం అందించడం వంటి మంచి ఆరోగ్య పద్ధతులను పాటించే మహిళలను ఈ సాష్‌ల ద్వారా ప్రోత్సహించనున్నారు.

"స్టార్ నాన్న" సాష్‌లను తమ భార్యలకు గర్భధారణ సమయంలోను, ప్రసవానంతరం పూర్తి సహకారం అందించిన తండ్రులను సత్కరించేందుకు బహూకరిస్తారు. ముఖ్యంగా గర్భిణిఅయిన భార్యను ఆసుపత్రికి తీసుకెళ్లడం, ఇంటి పనుల్లో సహాయం చేయడం, పిల్లల సంరక్షణలో భాగస్వామ్యం కావడం వంటి బాధ్యతలను నిర్వర్తిస్తున్న తండ్రులను ప్రోత్సహించేందుకు ఈ సాష్‌లు ఉపయోగించబడతాయి. కుటుంబ ఆరోగ్యం , మాతాశిశు సంక్షేమంలో తండ్రుల పాత్ర ముఖ్యమని తెలియజేయడం దీని ప్రధాన ఉద్దేశ్యం.


మొత్తం కార్యక్రమం ఉద్యోగుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడమే కాకుండా, మాతాశిశు ఆరోగ్యంపై అవగాహన పెంచడంలో కూడా గణనీయమైన పాత్ర పోషించింది. ■

అవకాశం కోసం ఎదురుచూడడం కాదు, ఎదురెళ్ళి అందిపుచ్చుకోవాలి

# శ్రీ సి.ఎస్. దంపతుల కైలాస-మానస సరోవర యాత్ర

*ఇటు మానస సరోవరం, అటు కైలాసం. చేరువలో హిమాలయ పర్వతశ్రేణులు. ఎట్టెదుట పర్యాటకులకు సవాలు విసిరే పరిక్రమ పరాక్రమాటోపం. కళ్ళు, మాటలు, మనస్సు మూగబోయి నిశ్చేష్టులనుచేసే అపురూప దృశ్యాలు! అది పరమశివుని పాదపీఠం. పార్వతీపరమేశ్వరుల లాస్య,తాండవ నృత్య విన్యాసాలతో పులకించిన ఆధ్యాత్మిక గిరిశిఖరం. భావుకుల మనోజ్ఞ సీమ! పర్వతారోహకులకు సవాలు విసిరే దుర్గమ సీమ! భారతీయ పురాణేతిహాసాలలో స్వర్గానికి మిన్నగా పేరెన్నికగన్న పరమపద సీమ! జీవితంలో ఒక్కసారైనా దర్శించి, తరించాలని తహతహలాడే హిందూ,బౌద్ధ,జైన మతానుయాయుల, పర్యాటకుల పూర్వజన్మ సుకృత పరీక్ష సీమ! ఇంతటి ఆశ్చర్యానంద ఆహ్లాద సీమను ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి, ఆయన భార్య శ్రీమతి సబిత ఇటీవల సందర్శించి వచ్చారు. ఆ అరుదైన అనుభూతి వివరాలను స్వయంగా శ్రీ సి ఎస్ రెడ్డి మాటలలో తెలుసుకుందాం. మనమూ ఆ ఆమందానంద పరోక్షానుభూతిలో పాలుపంచుకుందాం.*

'అబ్బవరం సబిత , నేను 2026 మే 12 నుండి 21 వరకు పవిత్రమైన కైలాస్-మానస సరోవర యాత్రను చేపట్టాము. ఇది విశ్వాసం, సహనం, ఆత్మాన్వేషణ , ఆధ్యాత్మిక పరిపూర్ణతతో కూడిన మరపురాని ప్రయాణంగా నిలిచింది.



మే 12న మా యాత్ర హైదరాబాద్ నుండి లక్నోకు విమాన ప్రయాణంతో ప్రారంభమైంది. అక్కడి నుండి మా ట్రావెల్ ఏజెంట్ ఏర్పాటు చేసిన కారులో గోపాల్‌గంజ్‌కు చేరుకున్నాము. నేపాల్‌లోని ప్రసిద్ధ సోల్టీ హోటల్స్ గ్రూప్‌కు చెందిన సోల్టీ హోటల్‌లో బస చేశాము. అక్కడ జేష్ఠాదేవి ఆలయాన్ని దర్శించుకునే భాగ్యం కలిగింది. ఇది ప్రసిద్ధ శక్తిపీఠాలలో ఒకటి.

మే 13న ఉదయం ఎటిఆర్ విమానంలో సిమికోట్‌కు ప్రయాణించాము. హెలికాప్టర్ వెంటనే అందుబాటులో లేకపోవడంతో సిమికోట్‌లోని ఒక హోటల్‌లో కొంతసేపు విశ్రాంతి తీసుకున్నాము. సుమారు ఐదు గంటల నిరీక్షణ అనంతరం, 20 నిమిషాల హెలికాప్టర్ ప్రయాణం చేసి హిల్సాకు చేరుకున్నాము. నేపాల్‌లోని ఈ చిన్న సరిహద్దు పట్టణం చైనా చెక్‌పోస్ట్‌కు కేవలం 100 మీటర్ల దూరంలో ఉంది. కొత్తగా నిర్మించిన 15 గదుల హోటల్‌లో బస చేశాము. ఆ రాత్రి నక్షత్రాలతో మెరిసే ఆకాశాన్ని తిలకిస్తూ గడిపాము. సిమికోట్ , హిల్సాలలో అందించిన ఆహారం ఎంతో రుచికరంగా, ఆతిథ్యం ఆప్యాయంగా అనిపించింది.

మే 14న చైనా చెక్‌పోస్ట్‌కు నడిచి వెళ్లి టిబెట్‌లోకి ప్రవేశించాము. మండే ఎండలో ఇమ్మిగ్రేషన్ , సామాన్ల తనిఖీ పూర్తి చేయడానికి గంటకు పైగా సమయం పట్టింది. అనంతరం చైనా నిర్మించిన అద్భుతమైన రహదారుల మీదుగా ప్రయాణించి పురాంగ్ (తక్లాకోట్/బురాంగ్) చేరుకున్నాము. అక్కడ హోటల్ హిమాలయాలో బస చేశాము.

ప్రకృతితో మమేకం కాలేనివారే ప్రార్థనా స్థలాల చుట్టూ చక్కర్లు కొడుతుంటారు

గ్రూప్ వీసాతో ప్రయాణిస్తున్నందున హోటల్ వెలుపలికి వెళ్లవద్దని సూచించారు.

మే 15న దర్చెన్‌కు బస్సులో చేరుకున్నాము. ఇది పవిత్ర కైలాస పర్వత ప్రదక్షిణకు ప్రారంభ కేంద్రం. మరుసటి రోజు ప్రారంభమయ్యే మూడు రోజుల కైలాస పరిక్రమకు సిద్ధమవుతూ ఉత్సాహంతో రాత్రి గడిపాము.

**కైలాస పరిక్రమ: మొదటి రోజు – 16 మే 2026**

పవిత్ర కైలాస పరిక్రమ ప్రారంభమైంది. మొదటి రోజు సుమారు 10 కిలోమీటర్ల మేర సులభమైన మార్గంలో నడిచి ఆరు గంటల్లో పూర్తి చేశాము. ఇది జీవితంలో ఒక్కసారే లభించే పవిత్రమైన, విశిష్టమైన ,ఉల్లాసభరితమైన అనుభవం. కైలాస పర్వత సన్నిధిలో నడవడం వర్ణనాతీతమైన ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించింది. ఈ ప్రయాణాన్ని నేను గుర్రం లేదా పోర్టర్ సహాయం లేకుండానే పూర్తి చేయడం నాకు ప్రత్యేక సంతృప్తిని ఇచ్చింది.

**రెండో రోజు – 17 మే 2026** : ఈ పరిక్రమ యాత్రలో అత్యంత సవాలుతో కూడిన రోజు రెండవది. సుమారు 24 కిలోమీటర్ల మేర, 15,000 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో నడిచి, దాదాపు 19,000 అడుగుల ఎత్తులో ఉన్న డోల్మా పాస్‌ను దాటాము.

ఈ ప్రయాణం పూర్తి చేయడానికి దాదాపు 12 గంటలు పట్టింది. మెల్లగా వీచే గాలి, ఎత్తైన రాళ్ళు, కఠినమైన మార్గం శారీరకంగా తీవ్ర పరీక్షకు గురి చేశాయి. అలసట కారణంగా నేను వందసార్లకుపైగా ఆగి కూర్చోవలసి వచ్చింది. అయినప్పటికీ, కైలాస క్షేత్రపు ఆధ్యాత్మిక శక్తి ముందుకు సాగేందుకు ప్రేరణనిచ్చింది.

**మూడో రోజు – 18 మే 2026**

ఉదయం 8 గంటలకు ప్రారంభించి 10:15 గంటలకు పరిక్రమను విజయవంతంగా పూర్తి చేశాము. సుమారు 7.7 కిలోమీటర్ల దిగువ మార్గం ఎంతో ఆహ్లాదకరంగా అనిపించింది. గత రెండు రోజుల మాదిరిగా దుమ్ముతో కూడిన గాలులు లేదా వాహనాల రాకపోకలు లేకపోవడంతో ప్రశాంత వాతావరణంలో నడక సాగింది. ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ, ఆధ్యాత్మిక ఆనందాన్ని అనుభవిస్తూ చివరి దశను పూర్తి చేశాము.



సబిత , నేను మా జీవితంలోనే అత్యంత కఠినమైన, అత్యంత ఉల్లాసభరితమైన, ఆధ్యాత్మికంగా అత్యంత సంతృప్తినిచ్చిన ఈ యాత్రను విజయవంతంగా పూర్తి చేయగలిగాము.

**తిరుగు ప్రయాణం**

కైలాస్–మానస సరోవర యాత్రను విజయవంతంగా పూర్తి చేసి, మే 20, 2026న సిమికోట్ నుండి విమానంలో నేపాల్‌గంజ్‌కు చేరుకున్నాము. అక్కడి నుండి రోడ్డు మార్గంలో లక్నో చేరుకుని, సాయంత్రం 5:45 గంటలకు హైదరాబాద్‌కు విమానం ఎక్కాము. రాత్రి 10 గంటలలోపే ఇంటికి చేరుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగించింది.

ఈ ప్రయాణాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే, ఈ పవిత్ర యాత్ర చేయగలిగిన అదృష్టం, దాన్ని పూర్తి చేయగలిగిన శక్తి, అలాగే మాతో పాటు ఈ ప్రయాణంలో భాగస్వాములైన సహయాత్రికుల స్నేహం ఎంతో ఆనందం కలిగిస్తుంది.

కైలాస్–మానస సరోవర యాత్ర కేవలం ఒక భౌతిక ప్రయాణం మాత్రమే కాదు. అది విశ్వాసం, సహనం, ఆత్మపరిశీలన , ఆధ్యాత్మిక జాగృతి వైపు సాగే ఒక మహోన్నత యాత్ర! జీవితాంతం మాతో నిలిచిపోయే అమూల్యమైన అనుభవం! ఈ విశిష్టమైన ఆధ్యాత్మిక అన్వేషణ యాత్రలో మమ్ములను ప్రోత్సహించిన వారందరికి కలిసి మా హృదయపూర్వక కృతజ్ఞతలు'. ■

**వ్యాపారాన్ని అభివృద్ధి మార్గంలో నీవు నడిపించలేకపోతే, నిన్ను పాతాళ మార్గాన అది నడిపిస్తుంది**

# వాతావరణ మార్పుల ప్రభావం

## వ్యవసాయంపై ...


వాతావరణ మార్పులు - వ్యవసాయం కరువు కాటకాల పాలు
పెరిగే ఎండలతో కరువు కాటకాలు - అధికమైన చీడపీడలు
భూమి గట్టిపడటం - భూసారం తగ్గిపోవడం
అడుగంటిన భూగర్భ జలాలు - ఆవిరవుతున్న నీటి వనరులు

భూమిలో తేమ లేదు - వేసిన విత్తు మొలవదు
అకాల వర్షాలు - నీరంతా సముద్రం పాలు
భూమిలోకి నీరు ఇంకదు - పంటకు నీరు అందదు

చేతికి రాని పంటలు - తగ్గిపోతున్న పంట దిగుబడులు
మేత, నీరు అందని జీవాలు - తగ్గిపోతున్న పశు సంపద
ఉపాధిలేని కుటుంబాలు - పెరుగుతున్న వలసలు
అప్పుల భారంతో వ్యవసాయం నష్టాల పాలు-
కృంగిపోతున్న రైతన్న జీవితాలు
అయినా... వానకోసం రైతన్న పడిగాపులు



## జీవనోపాధులపై....



పెరిగే వలసలు

రోగాలతో పెరుగుతున్న ఖర్చులు

ఆహార భద్రతకు ముప్పు

పోషకాహార లోపాలు

తగ్గే ఉపాధి అవకాశాలు

పంట నష్టాలతో పెరిగే అప్పులు

NABARD

RNI Regd.No: TELTEL/2003/16365 MAHILA SADHIKARATHA Postal Regd No: HCD-1064/2024-26
*Publication Date:01-06-2026* Posting at BPC-1V Patrika Channel, Nampally, Hyderabad-500001 *Posting Date: 05/06-06-2026*

## శ్రీ సి ఎస్ రెడ్డి దంపతుల మానస సరోవర యాత్ర ... మరికొన్ని దృశ్యాలు !








దహేగాం మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ నాల్గవ వార్షిక మహాసభ దృశ్యాలు





ఏపిమాస్ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు నీలోఫర్ ఆస్పత్రిలోని తల్లి పాల బ్యాంకును సందర్శించిన దృశ్యాలు





ఏపిమాస్ స్ఫూర్తితో స్వచ్ఛంద సామాజిక సేవలో విప్రో ఉద్యోగులు

To ADDRESS



రుతుక్రమ అవగాహన కార్యక్రమంలో ....

బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని,
తానీషానగర్, డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089